# మత ధిక్కారము కాదు
# సత్యగ్రాహితము


<u>రచయిత</u>

**పి. తులసీ రావు**

**(సువార్త క్రైస్తవ సంఘం సెక్రటరీ)**

**విజయనగరము, ఆం.ప్ర.**



<u>ప్రచురించిన వారు</u>

**సువార్త క్రైస్తవ సంఘం**

(Regd.No. : 159/2015)

**అనంతపురము జిల్లా.**

త్రైత శకము-37 ప్రథమ ముద్రణ : సం॥ 2015

ప్రతులు : 1000 **వెల : 40/-**

# సువార్త క్రైస్తవ సంఘం ప్రచురణలు

1. సువార్త బైబిలు.
2. దేవుని మార్గము - మన ప్రయాణము.
3. మత్తయి సువార్త మర్మాలు.
4. మతాలన్నిటికి ప్రాథమిక జ్ఞానము.
5. మత ధిక్కారము కాదు - సత్యగ్రాహితము.
6. పాప క్షమాపణ ఎలా కలదు?

## గ్రంథములు లభించు చిరునామా

**బి. యోహాను**

సత్యనారాయణపురం కాలనీ,

చైతన్యపురి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం - 500 060

Cell : 92982 01323, 9491040963

**పి. తులసీరావు**

శ్రీరాంనగర్ కాలనీ, ధర్మపురి రోడ్,

విజయనగరం జిల్లా, ఆం.ప్ర రాష్ట్రం - 535 002.

Cell : 94418 78096, 97035 34224

# దైవ సందేశము

మనిషి నడయాడే భూమి ఒక్కటే, మనిషి త్రాగే నీరు ఒక్కటే, మనిషి పీల్చే శ్వాస ఒక్కటే. ఒక మనిషికి ఎట్లు జీవితమున్నదో అట్లే మనుషులందరి జీవితమున్నది. ఒక మనిషికున్న అవయవములే మిగతా మనుషులందరికీ ఉన్నవి. ఒక మనిషికున్న అనుభవములే మిగతా మనుషులందరికీ ఉన్నవి. మనిషి పుట్టే పుట్టుక అందరికీ ఒక్కటే. మనిషి చచ్చేచావు అందరికీ ఒక్కటే. అందరూ బ్రతకాలని బ్రతుకు మీద ఆశపడుచున్నారు. అందరూ ఒకే ప్రపంచములోనే బ్రతుకుతున్నారు. అందరిలో ప్రేమ ఉంది, అలాగే అందరిలో అసూయ వుంది. ఒక మతస్థుడు నిద్రించినట్లే అన్ని మతముల వారు నిద్రపోవుచున్నారు. ఒక మతస్థుడు మేల్కొనినట్లే అన్ని మతముల వారు మేల్కొంటున్నారు. పుట్టిన వెంటనే పాలకోసము ఏడ్చే మానవుడు, కొంతవయస్సు వచ్చిన తర్వాత నేను సమస్త మనుషులలో ఒక్కనిగా ఉన్నాననీ, నావలె సమస్త మానవులు ఉన్నారనీ ఏమాత్రము అనుకోవడము లేదు. అందరూ బ్రతికే దానికే తాపత్రయపడు చున్నారనీ, నేనూ అందరివలె బ్రతకాలనుకొంటున్నాననీ ఏమాత్రము యోచించడములేదు.

కొంతవయస్సు వస్తూనే పుట్టిన కుటుంబము ఏ మతములో ఉంటే ఆ కుటుంబమునుబట్టి నేను ఫలానా మతస్థుడను అనుకోవడము ప్రతి మనిషి యెడల జరుగుచున్నది. ఇలా ఏడు సంవత్సరముల వయస్సులోనే 'మతము' అను రోగము ప్రతి మనిషికి అంటుకొనుచున్నది. యుక్తాయుక్తములు ఆలోచించలేని వయస్సులోనే మతము అంటు రోగము అంటుకొన్నట్లు అంటుకోవడము వలన దాని బారిన పడని మనిషి లేడు. వయస్సు పెరుగు కొలది మనిషికి జ్ఞానము పెరుగడము లేదు. విచక్షణ పెరుగడములేదు. నేను సమస్త మానవజాతిలో ఒక మనిషిని కదా! అని అనుకోవడము లేదు. దానికి వ్యతిరేఖముగా నేను ఫలానా మతస్థుడనను

భావము పెరిగిపోవుచున్నది. నాది ఫలానా మతమనీ, నా దేవుడు ఫలానా పేరు కలవాడనీ అనుకొనుచూ, తాను ప్రత్యేక తెగవాడిననీ, మా తెగ మనుషులు వేరనీ, మిగతా మనుషులందరూ వేరు తెగలవారనీ భేద భావమును పెంచుకోవడము జరుగుచున్నది. దానికితోడు తన మతము వారు చెప్పిన మాటలనే వింటూ, తమ గ్రంథములో దేవుడు మనుషులకు అందరికీ చెప్పిన మాటను మరచిపోయి తమ జ్ఞానమే వేరనుకొనుచున్నాడు. సమస్త మానవాళికి దేవుడు చెప్పిన జ్ఞానమున్నదని తెలియక, అజ్ఞానములో కూరుకుపోయి తనవలె అన్నీ సమానముగా యున్న మనుషులను తనకంటే తక్కువగా లెక్కించుచున్నాడు. దేవుడు చెప్పిన మతాతీత బోధను గ్రహించక చివరకు ఒక మతస్థునిగా ముద్ర వేసుకొంటున్నాడు. దేవుడు చెప్పిన బోధలో ఎక్కడా మతబోధ లేదు. దేవుని గ్రంథములలో మూడిటియందు మతాలకు అతీతమైన బోధవుండుట వలన, ఒక మతస్థుడు అయినవాడు ఎవడూ దేవుని జ్ఞానమును అందుకోలేక దేవునికి దూరముగా పోవుచున్నాడు. ప్రతి మతస్థుడు నేను దేవున్ని ఆరాధిస్తున్నానని అనుకొన్నా, దేవునికి దగ్గరగా పోతున్నానని అనుకున్నా, మతమున్న వాడు దేవునికి దూరముగానే పోవుచున్నాడు. మతములేని వాడు మాత్రమే నిజమైన పథమును అనుసరించి దేవునికి దగ్గరవుచున్నాడు. **మతాతీతుడయిన దేవున్ని మతము లేనివాడే చేరుకొనును.** నాది ఫలానా మతము అని జ్ఞాపకమున్నవాడు ఎవడూ దేవున్ని చేరలేడు. ఏ మతస్థున్నీ దేవుడు తన దగ్గరకు కూడా రానివ్వడు. నీకు దేవుడు కావాలా? మతము కావాలా? దేవుడు అవసరమైతే మతము అను ధ్యాస వదలుకో! మతము అవసరమైతే దేవుడు అను ధ్యాస వదలుకో!! ఏదో ఒక నిర్ణయము చేసుకో!!!

ఇట్లు

**నీ శ్రేయోభిలాషి**

# మత ధిక్కారము కాదు  సత్యగ్రాహితము

నేటి ఈ అజ్ఞాన అంధకార సమాజములో కుల మతాల బేధము లేకుండా ఇందూ జ్ఞాన సంబంధ పెళ్ళిళ్ళు చేసి, వారికి నిజమైన దైవజ్ఞానాన్ని తెలియజేస్తూ, మానసికమైనటువంటి ఎన్నో భవరోగములను లేకుండా చేసి, ఆత్మానందాన్ని కలుగజేస్తూ, మూడు మతాలలో ఉన్నది ఒకే దేవుని జ్ఞానము అని తెలియజేస్తూ, ఎంతోమంది మూఢులను జ్ఞానులుగా తయారు చేసిన **త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులకు** నా యొక్క పాదాభివందనాలు.

మేము వ్రాసినది మాకు మేముగా వ్రాయలేదు.  త్రైత సిద్ధాంత ఆదికర్త రచించిన గ్రంథములలో మేము గ్రహించిన జ్ఞానము ఆధారముతో వ్రాయడం  జరుగుతుంది.

మేము హిందూమతము నుండి క్రైస్తవుడుగా మారడం జరిగినది. ఇప్పటికి కూడా క్రైస్తవుడిగా ఉన్నాను, నిజము చెప్పాలంటే నేను ఇందూ క్రైస్తవుడను.  'ఇందూ' అనగా జ్ఞాని అని అర్థము.  (హిందూ అంటే అర్థము  లేదు.)

మేము బాప్తిస్మం తీసుకున్నాము కానీ  పేరు మార్చుకోలేదు. ఎందుకనగా! పేరుతో పనియే లేదు కదా! మతపిచ్చి ఉన్నవాళ్ళకు పేరుతో పని  ఉంది.

మేము వైష్ణవ సాంప్రదాయములో గల కుటుంబంలో జన్మించాము. మా తల్లితండ్రులది  మూఢత్వంతో కూడుకొన్న భక్తి అని ఇప్పటికీ వారికి తెలియదు.  ఒక రోజు మా నాన్నగారు మేము ఉంటున్న ఇంటిని, ఖాళీ స్థలాన్ని రాముని ఆలయం, కళ్యాణమండపం కోసమని గ్రామంలోని స్నేహితులకి ఇచ్చి మేమంతా అద్దె ఇంటికి వెళ్ళిపోయాము.

ఒకరోజు శంఖుస్థాపనకు మా నాన్నమ్మగారు వెళ్ళవలసి వచ్చింది. అపుడు మేము అక్కడే ఉన్నాము. పూజ చేస్తుండగా మా నాన్నమ్మగారికి కాలు, చేతులు వంకరలు తిరిగిపోయాయి. అప్పటినుండి ఆ సంఘటన నాకు ఒక ప్రశ్నగా మారిపోయింది. అసలు దేవుడు ఎవరు? రాముడు కాదా? కాకపోతే మరి ఎవరు? ఇలా ఎన్నో ప్రశ్నలు నాలో నేను వేసుకునే వాడిని...

అటువంటి సమయములో ఒక స్నేహితుడు కలిసినాడు. “మిత్రమా! ఏసుప్రభువు వారు నిజమైన దేవుడు, నాతో రోజూ చర్చికి రా!” అని చెప్పాడు. ఒకరోజంతా ఆలోచించి సరే! అసలు విషయము ఏంటో తెలుసుకోవాలని చర్చికి వెళ్ళడం జరిగింది.

అప్పటినుండి ప్రతి ఆదివారము షాపుకి సెలవుపెట్టి చర్చికి వెళ్ళే వాడిని, ప్రార్థనలు చేసేవాడిని. కొద్ది రోజులకు ఒక సంఘటన జరిగినది. మేమంతా ప్రార్థన చేస్తుండగా ఒక అమ్మాయి పరిశుద్ధాత్మ పొందుకుంది. ఆ టైంలో అది గొప్ప విచిత్రంగా అనిపించింది. అప్పుడు ఆ అమ్మాయిని అడిగాను, “నీకు ఏమి అనిపించింది?” అని...

**ఆమె :-** “నా శరీరము అంతా వేడి అయిపోయింది’ అని చెప్పింది.

**నేను :-** నీవు మాటలాడునప్పుడు ఏవో ఇతర భాషల్లో మాటలాడావు, ఆ భాష నీకు అర్థము అవుతుందా?

**ఆమె :-** అసలు నాకు జ్ఞప్తి ఉండదు. ఏదో చిన్నగా అనిపిస్తుంది.

తర్వాత ఇంకో స్నేహితుడు కూడా ఇలాగే పరిశుద్ధాత్మను పొందుకున్నాడు. అలా అయిదుగురికి జరిగింది. కానీ నేను, ఇంకో

మిత్రుడు మాత్రము ఎంత ప్రయత్నం చేసినా పొందుకోలేకపోయాము. వారు మాట్లాడిన భాషలు విన్న తర్వాత ఆశ్చర్యం కలిగింది, నిజమైన దేవుడు 'ఏసుప్రభువు' అని మరికొద్దిగా భావము దృఢపడింది. అప్పటినుండి ఎవరికైనా ఏసుప్రభువు మాత్రమే దేవుడని చెప్పేవాడిని.

అలా కొద్ది రోజులకు మా పాస్టర్‌గారు, మమ్ములను మోసము చేసి కొంత డబ్బు దోచుకున్నారు. తర్వాత పాస్టర్‌గారు, మేము గొడవపడి ఆ చర్చ్‌కి వెళ్ళడం మానేశాము. అప్పుడు మాకు ఒక ప్రశ్న మొదలైంది. దేవుని విషయం చెప్పిన పాస్టర్స్ తప్పుచేస్తే మరి ఎవరికి చెప్పుకోవాలి? ఇదే విషయాన్ని వేరొక పాస్టర్‌ని అడిగాము. అప్పుడు ఆయన ఏమన్నాడంటే "పాస్టర్‌లు దేవుడు ఎన్నుకున్నవారు కనుక పాస్టర్‌గారు తప్పు చేసినా వారిని మనము ఏమీ అనకూడదు, దేవుడే చూసుకుంటాడు" అని అన్నాడు.

అప్పటికి అర్థము అయినది. క్రైస్తవ సమాజము గొర్రెచర్మం కప్పుకున్న తోడేళ్ళుగా ఉంది అని తెలిసింది. ఈ రోజు ప్రజలు ఉగ్రవాదులుగా, నాస్తికవాదులుగా మారడానికి కారణము ఇటువంటి పాస్టర్స్ కాదా! అయినా తప్పంతా మాదే! దేవునివైపు ప్రయాణం చేసేటపుడు గుడ్డిగా ఎవరు ఏమి చెప్పినా నమ్మడమేనా? నీకంటూ దేవుడు బుద్ధిని ఇచ్చాడు. ఆ బుద్ధితో అన్వేషణ చేయి. **ప్రతి ప్రశ్నకూ సరైన సమాధానము ఎక్కడ దొరుకుతుందో, అదే నిజమైన దైవజ్ఞానము.** అలాకాక మా అమ్మగారు, తాతగారు నమ్మినారు, అందుకే నేను నమ్మాలి అనుకుంటే అజ్ఞానం. అందువల్ల మీరు మాలాగా మోసపోవద్దండి, ఏసుప్రభువు పేరు పెట్టి మాయా పాస్టర్‌లు, అలాగే మాయా స్వామిజీలు ప్రజల్ని జ్ఞానమువైపు కాక, అజ్ఞానము వైపు నడిపిస్తున్నారు.

సర్వజీవరాశులను దేవుడే సృష్టించాడు కావున దేవుడు అందరికీ తన జ్ఞానాన్ని సమానంగా పంచి ఉంటాడు. అలాంటపుడు వాడు తెలుసు కున్నది ఏంటి? మనము తెలుసుకోలేనిది ఏంటి? అనుకున్నాను. అటువంటి సమయములో "త్రైత సిద్ధాంత గ్రంథాలు" మాకు లభించాయి. మొదట మాకు లభించిన గ్రంథము **'సుబోధ'** అందులోని సృష్టి రహస్యం చదివాక తలకాయకు పని పడింది. ఇలా గ్రంథాలు చదవడం మొదలు పెట్టాను. మొదట్లో పెద్దగా అర్థము అయ్యేవికాదు, ఎందుకంటే అప్పటికే ప్రార్థనలనీ, ఉపవాసాలనీ రకరకాలుగా శరీరాన్ని అలవాటు చేశాను మరి...

అటువంటి సమయములో నా దగ్గరకు రోజూ ఇద్దరు లేక ముగ్గురు పాస్టర్స్ వస్తుండేవారు. మా చర్చ్‌కి రా! అని ఒకరు, కాదు మా చర్చ్‌కి రా! అని మరొకరు అంటుండేవారు. మీరు రావద్దు అని చెప్పినా కూడా వచ్చి ప్రార్థనలు చేసి పోయెడివారు.

మేము క్రమంగా త్రైత సిద్ధాంత గ్రంథాలు చదివిన తర్వాత మాకు కాస్త అర్థము అవుతుండేది. పాస్టర్స్ షాపుకి వస్తే బైబిల్‌లోని వాక్యములను మేము అడుగడం మొదలు పెట్టాం! పాస్టర్స్ చెప్పినవి చాలా తప్పులని మాకు తెలిసిపోయింది. అప్పుడు త్రైత సిద్ధాంతము దగ్గర ఎవరూ నిలబడ లేకపోతున్నారని అర్థము అయినది. త్రైత సిద్ధాంతము ఇప్పటిది కాదు, సృష్టి ఆదిలో దేవునిచే చెప్పబడినది. మరి ఇప్పుడు ఎలా బయటకు వచ్చింది అన్న సందేహం మొదలైంది. ఈలోగా **"జనన మరణ సిద్ధాంతము"** గ్రంథము నా సంశయాలన్ని తీర్చేసింది. తర్వాత స్వామివారి వద్దకు వెళ్ళాను. నేను క్రైస్తవుడను మీ జ్ఞానము తెలుసుకుంటున్నాను అని అంటే ఆయన గొప్ప మాట చెప్పారు.

"ఎవరూ మతము మారాల్సిన అవసరము లేదు, ఎవరి మతంలో వారే ఉండండి. ఆయా మతములలో ఉన్న గ్రంథాలను తెలుసుకోండి. ఏ మతములో ఎవరైనా దేవునికి తెలియకుండా పుట్టలేదు కదా! అజ్ఞానము వల్ల మతాలు మారుతారు కానీ, జ్ఞానము తెలిస్తే అన్ని మతాల సారము ఒక్కటే, భగవద్గీతలో ఉన్నదే బైబిల్, ఖురాన్‌లలో ఉంటుంది" అని చెప్పారు. క్రైస్తవుడిగానే ఉంటూ ప్రభువు ఉన్నత స్థితిని తెలియజేయమని చెప్పారు.

కానీ ఈ రోజుల్లో కొందరు మా దేవుడే సత్యము, మాదే నిజమైన మార్గము అని అంటున్నారు. ముస్లీమ్‌లు అల్లాహ్‌యే సత్యము అంటున్నారు. కానీ స్వామివారు మూడు గ్రంథాలలో దేవుడు చెప్పిన జ్ఞానమే ఉంది అని చెప్పడమే కాక, ఈ రోజు మూడు గ్రంథాలలో ఉన్న జ్ఞానాన్ని ముందు పరచి పెట్టినారు. ఇక మత గురువుల పప్పులు ఉడకవు. దొంగలు దొరకక తప్పదు. తోడేళ్ళ అరుపులు ఇక తగ్గవలసిందే! లేకపోతే వాక్యమనే కత్తితో నరికేస్తాము. క్రైస్తవ ప్రియులారా! త్రైత సిద్ధాంతాన్ని తెలిస్తేనే నిజమైన ప్రభువు వాక్యములకు అర్థము తెలుస్తుంది. మతము అనేది ఒక భయంకర మైన వ్యాధి, దానికి సంపూర్ణమైన మందు దేవుని జ్ఞానమే.

## ఈ మధ్య జరిగిన సంఘటన :

మా షాపుకి ఒక పాస్టర్‌గారు వచ్చారు, ఆయన ఇదివరకు తెలిసిన వారే, వారిని ముందు మేమే పిలువడం జరిగింది.

**నేను :-** అయ్యా! పాస్టర్‌గారు నమస్కారము.

**పాస్టర్ :-** ఎందుకయ్యా! పిలుస్తావ్, మీకు మాకు పడదు కదా!

**నేను :-** అలా అనకండి సర్! దేవుని విషయం మీ దగ్గర తెలుసుకోవాలని తప్ప మాకు వేరు ఉద్దేశ్యము లేదండి!

అప్పుడు ఆయన సామెతలతో ఒక వాక్యమును చెప్పారు. ఆ వాక్యం తప్పు చెప్పడము వల్ల ఆయనతో అలా కాదు, ఒకసారి మీ బుద్ధితో ఆలోచించండి అని అన్నాను. (వెంటనే...)

**పాస్టర్ :-** "నీవు నాకు చెప్పేంతటోడివా!" అని బిగ్గరగా కేకలు వేసి, "నీవు నా మతములోనికి వస్తే నా ఆస్తి అంతా రాసిస్తా" అని అన్నాడు.

**నేను :-** "సంబంధము లేని మాట అది, నేనేమన్నాను, మీరేమి అంటున్నారు?" అని అన్నాను...

**పాస్టర్ :-** "నీవు నా మతములోనికి వస్తే నేను చావడానికి సిద్ధం" అని అన్నాడు.

**నేను :-** (నాకు బాగా కోపము వచ్చింది) "సరే పాస్టర్‌గారు మీరు చచ్చిపోండి, నేను వచ్చేస్తా" అన్నాను.

పాస్టర్ :- అలాకాదు, పోలీస్ స్టేషన్‌కు రండి! అగ్రిమెంట్ వ్రాసుకుందాము.

ఇటువంటి పాస్టర్‌లు ఉన్నారంటే విశ్వాసులు ఏమైపోతారండి, ఈ పాస్టర్ విజయనగరంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.

ప్రియమైన క్రైస్తవ సోదరీ, సోదరులారా! ఎవరిని పడితే వారిని నమ్మవద్దు. ఆధ్యాత్మిక ప్రయాణంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏది సత్యమో తెలుసుకోవాలి. తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం దేవుని జ్ఞానము సంపూర్ణముగా త్రైత సిద్ధాంత గ్రంథాల ద్వారా తెలియ బడుతుంది. బైబిల్ అర్థము కావాలంటే త్రైత సిద్ధాంతము తెలియాలి. మతము అనే మత్తు వదిలి మీరే ఆలోచించండి ఒకసారి!...

కొంతమంది క్రైస్తవులు "ప్రళయం తర్వాత ప్రభువు ఆకాశ మేఘరూఢుడై వస్తాడు, ఆయనకన్నా ముందు ఇద్దరు దేవదూతలు వస్తారు, తర్వాత ప్రభువు వారు ఆకాశమునుండి దిగుతారు, అప్పుడు తీర్పు తీర్చుతారు" అని అంటున్నారు.

ఇప్పుడు మీరు అనుకున్నా ప్రళయమైతే భూమి, ఆకాశము అన్నీ లేకుండాపోయినప్పుడు, ఆకాశమేఘరూఢుడై ఎలా వస్తాడు? మీరు ఏమీ యోచించరా? గ్రుడ్డిగా నమ్మడమేనా మన క్రైస్తవము... మా ప్రక్క ఉన్న ఒక స్నేహితుడు ఇలా అన్నాడు. "ఏసు అదే ఆకారములో వస్తాడంటే అంతవరకు ఎక్కడ ఉన్నట్లు" అని అన్నాడు. "మరి పరలోకములో ఉన్నాడు అంటున్నారు కదా! అయితే ఏసుప్రభువుకి గెడ్డం పెరుగుతుంది కదా! అక్కడ బార్బర్స్ ఉంటారా? బ్లేడ్స్, రేజర్స్ దొరుకుతాయా? ఎందుకంటే 2000 సం॥ల క్రితము నుండి ఆయన పరలోకములో అలాగే ఉంటే గెడ్డం ఎంత పెరిగి పోతుందో కదా!" అని అన్నాడు.

ఇంకా కొంతమంది పాస్టర్స్ అయితే పరలోకము గురించి మాట్లాడుతూ బంగారం చెట్లు, బంగారం రోడ్లు అన్నీ పరలోకములో ఉంటాయి. అంతా బంగారమే ఎలాంటి లోటు ఉండదు అక్కడ అంటున్నారు. అలా అయితే అక్కడ బంగారమే తింటారా? బంగారము మీదే పడుకుంటారా? అనేది మా ప్రశ్న? లేదు ఆ లోకములో ఆకలి వేయదు అంటారు. అలాగే అయితే శరీరముతో ఉంటారా అంటే అవును! శరీరముతోనే ఉంటాము అంటున్నారు. శరీరము ఉంటే రక్తప్రసరణ ఉంటుంది, రక్తప్రసరణ జరుగుతుంది అంటే నరాలు పనిచేస్తున్నట్లు కాదా! నరాలు పనిచేస్తే శ్వాస పని చేసినట్లు కదా! అంటే నీవు ఇక్కడ ఉన్నట్లు

ఉంటే అక్కడ కూడా మరణించాలి కదా! మరణిస్తే ఎక్కడికి పోతావు? అంటే జవాబు లేదు.

"నిజమైన పరలోకము తెలియాలంటే మొదట నా నీతిని, నా రాజ్యాన్ని వెతుకుడి" అని ప్రభువు అంటే మీరు పగటి కలలు కంటూ ఎంత అజ్ఞానములో ఉన్నారో ఆలోచించండి. నిజమైన ప్రభువు నీతి, ప్రభువు రాజ్యాన్ని కావాలంటే మతము అను గోడ తీసి మూడు గ్రంథాలలో ఏముందో పరిశోధన చేయండి, అపుడు తెలుస్తుంది. చాలామందికి ఈ మూడు దైవ గ్రంథాల పేర్లే తెలియదు. క్రైస్తవులేమో బైబిల్ తప్ప మేము ఇంకో గ్రంథాన్ని చదువము అంటున్నారు, ఎవరినీ చదువవద్దు అంటున్నారు ఎందుకు? త్రైత సిద్ధాంత భగవద్గీత చదివితే నిజం తెలుస్తుందని భయమా? వారి జీవన మనుగడ ఉండదని భయమా?

నిజమైన క్రైస్తవ సోదరులారా! మతము అను అడ్డుగోడ నుండి బయటికిరా! ఒక్కసారి మూడు గ్రంథాల సారము తెలుసుకో, అపుడు తెలుస్తుంది ఆయన రాజ్యము, ఆయన నీతి. అయితే మీరు నాకొక ప్రశ్న వేయవచ్చు, "నీవు క్రైస్తవుడవు అంటున్నావు, మరి వేరే గ్రంథాన్ని ఎందుకు చదువుచున్నావు, నీవు నిజమైన క్రైస్తవుడివా?" అని నన్ను అడుగవచ్చు.

మేము నిజమైన క్రైస్తవులమే. మాది **"సువార్త క్రైస్తవ సంఘం"** (రి.నం.159/2015) నిజమైన ప్రభువు ఉన్నత స్థితి తెలియజేసే ఏకైక సంఘము. నిజమైన ప్రభువు వాక్యాలు తెలియాలంటే మూడు ఆత్మల వివరము తెలియాలి. బైబిలులో ప్రభువు తెల్పిన నాలుగు సువార్తలే జ్ఞానంగా భావించి, అదే జ్ఞానాన్ని ప్రచారము చేసే సంఘం. **"మధ్య దైవగ్రంథములో సువార్త వాక్యములు", "ప్రథమ దైవగ్రంథము త్రైత సిద్ధాంత భగవద్గీత",**

**"అంతిమ దైవగ్రంథములో జ్ఞాన వాక్యాలు"** చదవండి అపుడు తెలుస్తుంది. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అంటే ఏమిటో? దేవుని జ్ఞానము తెలియకపోతే నీ పని భయంతో కూడిన ప్రార్థనలే. అలాంటి ప్రార్థనల వలన మాయలో పడిపోతావు, జాగ్రత్త!

## ఇపుడు బైబిల్ వాక్యములు చూద్దాం :-

పాత నిబంధన ఉన్నప్పుడు, కొత్త నిబంధన లేదు. అప్పటికి ప్రభువువారు జన్మించలేదు. ప్రభువువారు రాకముందు గల పాతనిబంధన లో కొంత చరిత్ర కలదు (అది మనుషులు వ్రాసినది). ఉదాహరణకు ఆదాము, హవ్వకి ఇద్దరు కుమారులు పుట్టారు. వారిపేరు హేబెలు, కయీను. వీరిద్దరికీ గుణప్రేరణ వల్ల అసూయ అను గుణము వలన కయీను, హేబెలును చంపేశాడు. ఇక ఉన్నది ఒక్కడే కదా! ఇంకెవరూ లేరు అలాంటపుడు కయీను ఎవరితో కలిస్తే ఇపుడున్న సంతానము వచ్చింది అన్నది ప్రశ్న?

అలాగే సృష్ఠి లేనపుడు అగాధి జలముల మీద దేవుని ఆత్మ అల్లాడు చుండును అని ఉంది. అయితే ఎవరు చూశారు? దానిని అనేది ప్రశ్న.

**(హెబ్రి–8:7)** పాతనిబంధన లోపము లేనిదైతే క్రొత్త నిబంధనకు అవకాశము ఉండనేరదు కదా!

దేవుడు అంటే దేవులాడబడేవాడు. ఎంత వెదికినా దొరికేవాడు కాడు. రూపములేని దేవుడు అవసరమైనపుడు రూపమున్న దేవుడుగా రావచ్చును. అలా వచ్చినవాడు మొదట శ్రీకృష్ణుడు (క్రిష్), తర్వాత క్రీస్తు అలా వచ్చిన దేవుడు పరమాత్మను చేరే విధానాన్నే బోధిస్తాడు. కానీ ప్రపంచ విషయాల్ని బోధించడు. అటువంటప్పుడు పాత నిబంధనలో ఎక్కడ చూసినా ఒకరితో ఒకరు మాట్లాడు సన్నివేశాలే ఎక్కువ కనపడుతున్నాయి, కనుక

పాత నిబంధనలో దైవజ్ఞానముకన్నా ప్రపంచ జ్ఞానము ఎక్కువ కనపడుతుంది.

**(హెబ్రు-8:13)** ప్రభువు సెలవిచ్చుచున్నాడు. (ఏమని) అంటే ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది.

**(2వ కొరంథీయులు-3-14)** వారి మనస్సులు కఠినములాయెను గనుక నేటివరకును పాతనిబంధన చదవబడుచున్నప్పుడు, అది క్రీస్తునందు కొట్టి వేయబడెనని వారికి తేటపరచబడక, ఆ ముసుకే నిలిచి ఉన్నది.

కావున క్రైస్తవ సోదరులారా! ఇప్పటికైనా ఆలోచించండి. బైబిల్ మొత్తములో నాలుగు సువార్తలే ప్రభువు చెప్పిన జ్ఞానము. అంతకుమించి పోతే మాయవైపు పోతారు, జాగ్రత్త! భగవద్గీత, బైబిల్, ఖురాన్ ఈ మూడు దైవగ్రంథాలు అర్థము కావాలంటే దేవుని జ్ఞానానికి ఒక సూత్రము కలదు, దానిని దేవుడే తెలియజేయాలి. సృష్టి ఆదిలో దేవునిచేత చెప్పబడిన సూత్రమే శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానందయోగీశ్వరుల ద్వారా తెలియజేయబడుతుంది. అదే "త్రైతము'. అద్వైత్వము, విశిష్ఠాద్వైతము, ద్వైతము తర్వాత వచ్చినది త్రైత సిద్ధాంతము.

ఆ సూత్రమే భగవద్గీతలో క్షర, అక్షర, పురుషోత్తముడు

(పురుషోత్తమ ప్రాప్తి యోగము, 16,17 శ్లోకములు)

ఆ సూత్రమే బైబిల్‌లో కుమారుడు, తండ్రి, పరిశుద్ధాత్మ

(మత్తయి సువార్త, 28వ అధ్యాయము 19వ వచనము)

ఆ సూత్రమే ఖురాన్‌లో తోలబడేవాడు, తోలేవాడు, సాక్షిగా ఉండేవాడు.

(సూరా 50, ఆయత్ 21)

ఈ మూడు గ్రంథాలలో మూల సూత్రంగా "త్రైత సిద్ధాంతమే" ఉంది. ముందుగా త్రైతమంటే ఏమిటో తెలుసుకుందాము. దేవుడు సృష్టించిన సృష్టిలో మూడు ఆత్మల గుర్తుగా దేవుడు బయట, లోపల అమర్చినాడు. దేవుడు మూడు ఆత్మలుగా విడిపోయాడు. కానీ మూడు ఆత్మలుగా లేడు. మూడు ఆత్మలు అనగా ముగ్గురు పురుషులు కనుకనే దేవుడు తన సృష్టిలో జీవరాశుల పుట్టుకను మూడు రకాలుగా పెట్టాడు 1) అండజ, 2) పిండజ, 3) ఉద్భిజములు.

మానవుని శరీరములో జ్ఞానేంద్రియాల్లో ముఖ్యమైన 'కన్ను'లోనూ, కర్మేంద్రియాల్లో ముఖ్యమైన 'చేతి'లోనూ ఈ మూడు ఆత్మల గుర్తును దేవుడు పెట్టాడు. చివరికి తనజ్ఞానము భూమిమీదికి వచ్చే విధానాలు కూడా మూడే. తన జ్ఞానమును తెలియజేసే గ్రంథాలు కూడా మూడే.

**(యోహాను : 4:23)** యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యము తోనూ తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది.

ఇక్కడ ఆరాధించువాడు జీవాత్మ
ఆరాధించబడినది ఆత్మ
పరమాత్మ ఒకరున్నారని తెలుస్తుంది. ఇదే త్రైత సిద్ధాంతము.

## బైబిల్‌లో మూడు ఆత్మల వాక్యములు :-

**ఆత్మ :-** నన్ను (ఆత్మ) వెంబడించువాడు, చీకటిలో నడువక జీవపు వెలుగులు కలిగి ఉండును.

**జీవాత్మ :-** జ్ఞానము జీవునికి ఎపుడు తెలుస్తుందో అపుడు జీవునికి వెలుగు ఉంటుంది.

**పరమాత్మ, ఆత్మ :-** నేను ఒక్కడినై ఉండక నేనునూ, నన్ను పంపిన తండ్రియూ ఏకమై ఉన్నాము.

**పరమాత్మ, ఆత్మ :-** నన్ను పంపినవాడు సత్యవంతుడు. నేను ఆయనవద్ద వినిన సంగతులే లోకమునకు బోధించుచున్నాను.

ఈ విధముగా మూడు ఆత్మలైన జీవాత్మ, ఆత్మ, పరమాత్మల వివరాన్ని తెలిపే వాక్యాలు బైబిల్‌నందు ఎన్నో ఉన్నప్పటికీ వాటిని ఎవరూ గ్రహించ లేకున్నారు. ఇప్పటికైనా నిజమైన క్రైస్తవుడిగా మారాలంటే మూడు ఆత్మల జ్ఞానాన్ని తెలుసుకోండి!

నిజమైన ప్రియ సోదరుడా! ఒక్కసారి వెను తిరిగి చూసుకో, సత్యము తెలియబడుతుంది.

1) నీవు ఎలా పెరుగుతున్నావో చూసుకో, పై నుండి క్రిందికి పెరుగు చున్నావు.

2) చెట్లు క్రిందనుండి పైకి పెరుగుతున్నాయి.

3) జంతువులు, పక్షులు, పాములు వగైరా అన్నీ అడ్డంగా పెరుగు తున్నాయి. అసలు నీవు క్రిందకు ఎందుకు పెరుగుచున్నావో ఒక్కసారి ఆలోచించు. చెట్లకు భూమిలో నీరుంది కనుక పెరుగుచున్నాయి. నీ తలకాయలో ఏముందో? అక్కడ ఏమి జరుగుతుందో, మెదడులో ఏముంది అని తెలుసుకున్నప్పుడు నీవు నిజమైన క్రైస్తవుడివి. అప్పుడు నీలో ప్రశ్న ఉద్భవిస్తుంది.

దేవుడు నా శరీరాన్ని ఎలా పెంచుతున్నాడు. అసలు ఊపిరి ఎలా ఆడుతుంది, ఆడకపోతే బ్రతకలేను కదా! అసలు ఈ శరీరములో

నేను ఎవరిని, నా స్థానము ఏది అని ప్రశ్నించుకో? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానము దొరికేదే నిజమైన దైవజ్ఞానము. ఈ రోజు **శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు** మన కొరకు **"ప్రథమ దైవగ్రంథము త్రైత సిద్ధాంత భగవద్గీత"** రచించారు. అందులో నీ తలరాత (కర్మ), జీవులు ఈ కర్మను ఎలా అనుభవిస్తున్నది మొత్తము వివరము కలదు. ఈ వివరమే ద్వితీయ దైవగ్రంథమైన బైబిల్‌నందు కూడా కలదు. అయినా ఆ వెలుగును చీకటి గ్రహించకున్నది.

అసలు నీవు ప్రాథమికంగా తెలుసుకోవలసిన ప్రశ్న నీవు పుట్టావు, "ఒకరోజు మరణిస్తున్నావు, ఈ మధ్యకాలములో జరుగుచున్న కష్ట సుఖాలకు కారణము ఏమిటి? నీవు ఎంత బాగా నడుచుకోవాలనుకున్నా ఎందుకు కష్టాలు వస్తున్నాయి, నేను చాలామందికి సాయపడ్డాను అయినా నాకు ఎందుకు మంచి జరగడం లేదు" అని దేవుడిని ప్రశ్నించి తిట్టే పరిస్థితి ఉంది. ఎందుకంటే దేవుని జ్ఞానము మనము తెలుసుకోక ప్రార్థనలని, పాటలని రకరకాలుగా మన ప్రవర్తన ఉంది. ఆదియందు ప్రార్థనలు లేవు, దేవుడు, దేవుని వాక్యము మాత్రము ఉంది. ఆ వాక్య జ్ఞానమును తెలుసుకుంటే నీ తలరాత మారుతుంది.

హిందువు అయినా, ముస్లీమ్ అయినా, క్రైస్తవుడైనా అందరూ బాధలు ఒకేలా అనుభవిస్తున్నారు. కష్టాలు సుఖాలు అన్నీ ఒకేలాగ ఉన్నాయి. అటువంటప్పుడు జ్ఞానము కూడా అందరి యెడల సమానమే. కానీ మనిషి అజ్ఞానము వల్ల మతాన్ని సృష్టించుకొని, ఇది నాది, అది నీది అని మనుషులను విభజించుకున్నాడు. కానీ దేవుడు ఏ గ్రంథములో కూడా ఇది ఫలానా మతానికి అని చెప్పలేదు. సర్వమానవాళికి అని చెప్పాడు. దేవుడు ఒక్కడే అయినపుడు దేవుని జ్ఞానము కూడా ఒక్కటే.

అటువంటి దేవుని జ్ఞానాన్ని ప్రస్తుతము భూమిమీద సంపూర్ణముగా **"త్రైత సిద్ధాంతము"** అనే సూత్రము ద్వారా స్వామి శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు తెలియజేస్తున్నారు. దైవజ్ఞానాన్ని శాస్త్రబద్ధముగా విజ్ఞాన సహితముగా తెలియజేస్తూ, సూక్ష్మంగా ఉండే జ్ఞానాన్ని స్థూలముగా గుర్తు రూపంలో చూపిస్తూ 'దేవుని చిహ్నము'ను తెలియపర్చిన త్రిమత ఏకైక గురువు ఆయన. ఈ రోజు ప్రపంచములో ఎవరూ వ్రాయనన్ని ఆధ్యాత్మిక గ్రంథాలు, ఎక్కడా తెలియబడని ఆధ్యాత్మిక రహస్యాలు తెలియజేస్తున్న శక్తి శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు. అందువలన త్రైత సిద్ధాంతము తెలియనిదే ఎవరికీ దైవజ్ఞానము తెలియదు.

ప్రియమిత్రులారా! దేవుడు భూమిమీదకి వస్తే ఆయన తెలియజేసిన విధానము ఎట్లుంటుంది అంటే "చెప్తున్నది నేను కాదు, నాలో ఆత్మ చెప్తుతుంది" అని అంటాడు.

**ప్రభువు :-** నేను చెప్పినవి నాయంతటన నేను చెప్పడము లేదు, నన్ను పంపిన నా తండ్రి చెప్పినదే చెబుతున్నాను అంటాడు. ఇలా అనేకమైన వాక్యాలు బైబిల్‌లో ఉన్నాయి.

అదే భగవద్గీతలో అయితే నాకు చావులేదు, పుట్టుకలేదు అని అంటాడు. మళ్ళీ ధర్మములకు గ్లాని ఏర్పడినప్పుడు నేను ప్రకృతితో తయారైన శరీరముతో జన్మిస్తాను అని అన్నాడు. ప్రభువు నేను చెప్పలేదు అంటాడు. కృష్ణుడు నాకు పుట్టుక లేదు, చావులేదు అవసరము అయినప్పుడు నేను పుడతాను అంటాడు. ఇలా ఎందుకు అపరిచితుడి పాత్రలా ఉందో మనకు అర్థము కాదు. ఆ రోజు ప్రభువు వారు ఎన్నోసార్లు ఆత్మ అయి ఉండి చెప్పిన విషయాలను, క్రియలను నేను దైవాన్ని అని చెప్పినప్పటికీ ఆయనను

పిచ్చివాడుగా చూచారు. రాళ్ళతో కొట్టారు చివరకు పాపాన్ని మూటగట్టు కున్నారు. అలాంటి పొరపాటు మనము చేయనప్పటికీ, మిత్రులారా! శ్రద్ధతో, బుద్ధితో ఆ దైవాన్ని జ్ఞానము తెలియజేయమని కోరుకోండి.

ఈ రకంగా ఉండే భగవంతుని జన్మ వివరము పూర్తిగా తెలియా లంటే **"త్రైత సిద్ధాంత భగవద్గీత"** ఆధారము. అందువల్ల క్రైస్తవులమైన మనమందరము ఖచ్చితముగా భగవద్గీత చదవాలి. అందులో శరీర యంత్రాంగ వివరము, జీవాత్మ వివరము, పంచభూతాల వివరము, మాయ వివరము పూర్తిగా ఉంటుంది. ఈ పూర్తి జ్ఞానము మనకు తెలియబడితే అపుడు మనల్ని ఎవరూ మోసము చేయలేరు. అపుడు తెలుస్తుంది, ఈ అబద్దపు బోధకుల గూర్చి, అబద్దపు బాబాలు, స్వామిజీల గూర్చి వారు జ్ఞానాన్ని ఎంత వక్రంగా బోధిస్తున్నారో, మనము ఇంతకాలము ఎంత మోసపోయామో? జాతి, కులం, మతం అని వ్యత్యాసం లేకుండా అందరూ తెలుసుకోవలసిన గ్రంథము భగవద్గీత. దేవుడు భూమిమీదకి వచ్చే రాక సమీపిస్తున్నది. జాగ్రత్త పడండి. దేవునికి ఇష్టులుగా మారండి.

ఆ రోజు ప్రభువు వారు శిష్యులతో మాట్లాడుచూ నేను వెళ్ళినచో మీకు మేలు. నేను వెళ్ళినచో **"ఆదరణ కర్త"** మీ వద్దకు వస్తాడు, ఆయన నేను చెప్పినవి, చెప్పనివి అన్ని సంగతులు మీకు తెలియజేస్తాడు. అపుడు మీరే నాకు సాక్షులు.

ఆయన అలా చెప్తే ఇప్పటి క్రైస్తవులు పరిశుద్ధ ఆత్మ దేవుడు మనలోకి పరిశుద్ధ ఆత్మ ప్రవేశించినపుడు తెలియజేస్తాడు. అలా శరీరాలనుండి తెలియజేయడమే ఆదరణకర్త చెప్పడము అంటున్నారు. కానీ అజ్ఞానం వల్ల దెయ్యాల్ని పరిశుద్ధాత్మ అని అంటున్నారు. అలా ఎవరైనా ఇంతవరకు

క్రొత్త విషయాలను ఎందుకు తెలియజేయలేకపోయారు. ఇలా చెప్పే బోధలన్ని దేవుని బోధలే అనుకోకండి. గ్రుడ్డిగా అయ్యాగారు ఏది చెప్తే అదే నిజం అనుకోకండి. మీకు దేవుడు బుద్ధి ఇచ్చాడు కదా! ఆ బుద్ధితో యోచించండి.

ఆదరణకర్త వస్తాడు అంటే ముస్లీమ్‌లేమో ముహమ్మద్ ప్రవక్త గారిని ఆదరణకర్త అంటున్నారు. ఆదరణకర్త నేను చెప్పని విషయములను తెలియజేస్తాడు అని చెప్పారు. ముహమ్మద్ ప్రవక్తగారు స్వయముగా ఏదీ చెప్పలేదు. ఆయనకు హీరా కొండగుహల్లో 23 సం॥ల పాటు మహాజ్ఞాని జిబ్రయేల్ చెప్పడము వలన అది విని ప్రవక్తగారు తన అనుచరులకు ఆ జ్ఞానాన్ని బోధించారు. దేవునిచే ఎన్నుకోబడిన ప్రవక్త ముహమ్మద్‌గారు, ఆయనే చివరి ప్రవక్త కానీ, ఆదరణకర్త కాదని తెలిసిపోతుంది. ఈ రకంగా జ్ఞానాన్ని సక్రమంగా అర్థము చేసుకోకుండా ఎవరికి వారు దానిని అనుకూలంగా మాట్లాడుచున్నారు.

అయితే ఇదంతా దేవునికి తెలియకుండా జరుగడము లేదు. ఎవరైనా దేవుని జ్ఞానము తెలియాలన్నా దేవునికి ఇష్టము ఉండాలి. అప్పుడే ఎవరికైనా జ్ఞానము అర్థమగును. కనుక మిత్రులారా జాగ్రత్త! ఇప్పటికైనా ప్రభువువారు చెప్పినట్లు చెప్పిన సంగతులు, చెప్పని సమస్త జ్ఞాన సంగతులు త్రైత సిద్ధాంతములో తెలియబడుతున్నాయి. మన బుద్ధిని ఉపయోగించి ఏది నిజమో, ఏది అసత్యమో యోచిద్దాము.

ఈ రోజు అభివృద్ధి అయిన సైన్సును చూచి ఇంతకన్నా గొప్ప లేదనుకుంటే పొరపాటు. సైన్స్‌కే అందని ఎన్నో విషయాలు ఈ రోజు మనముందున్నాయి. దేవుని చట్టాన్ని, దేవుని పరిపాలనా విధానము తెలియని

మనిషి, దైవచట్టానికి వ్యతిరేఖంగా ప్రవర్తిస్తున్నాడు. ఇదంతా చూస్తున్నా దేవుని పరిపాలకులు ఊరకుంటారా? మీరే ఆలోచించండి. అందువల్ల ప్రపంచములో ఉండే ప్రతి బాధకు దైవజ్ఞానములోనే సాంత్వన కలదు. దేవుని జ్ఞానాన్ని తెలుసుకుంటే నీ జన్మ రాహిత్యమైపోయి నీవు దేవునిలో ఐక్యము అవుతావు.

దేవుడు భూమిమీదికి మనిషి రూపంలో వచ్చినపుడే ఎవరికీ తెలియని, ఎంతో గొప్ప ఆధ్యాత్మిక రహస్యాలు తెల్పబడతాయి. అటువంటి దైవము మనిషి రూపంలో ఉన్నపుడు కనుగొనలేని అజ్ఞానులమైన మనము ఆ దేవున్ని బంధించి, హింసించి మేము దేవున్ని కనుగొన్నాము, దైవ వివరము మాకు తెలుసు అని విర్రవీగి పోతున్నాము. దేవుడు సృష్ఠించిన సృష్ఠినే తెలుసుకోలేని మనము, జీవాత్మ, ఆత్మ, పరమాత్మలను ఎప్పటికీ తెలుసుకో లేము. ఎందుకంటే మాయను తయారు చేసిన గురువుకి మాయ వివరము పూర్తిగా తెలుసును. ఆ గురువు దొరికేవాడు కాదు, గురువును ఎవరూ గుర్తించలేరు. అటువంటి గురువు చెప్పిన జ్ఞానము కూడా బుద్ధికి గ్రహింపు కలగాలంటే ఆ శక్తిని కూడా ఆయనే ప్రసాదించాలి.

పరమాత్మ అంశ భగవంతునిగా జన్మిస్తే అతనే 'గురువు' అగును. ఆ జన్మ విరవము ఎవరూ తెలుసుకోలేరు. కానీ దేవుడు తెల్పిన సూత్రము ప్రకారము మనము కొంత గ్రహించవచ్చు. ఎలాగంటే ***"ఎక్కడయితే తెలియని ధర్మాలు తెలియబడుచున్నవో, ఎచ్చటైతే, ఆచరణలో ఉండి అర్థ రహితమైన కార్యక్రమాలు ధర్మయుక్తంగా బోధించబడుచున్నవో, ఎచ్చటైతే పూర్వముండి ఇపుడులేని పరమార్థ రహస్యాలు తెల్పబడుచున్నవో, ఎచ్చటైతే మానవుని బుద్ధికి అందని ఆత్మ విషయాలు బోధించబడుతున్నాయో, ఎచ్చటైతే మతాతీత బోధ కలదో అచ్చట పరమాత్మ జన్మ ఉన్నదని తెలియ వచ్చును."***

కానీ ఒక శరీరమునుండి బయటికి వచ్చు బోధను బట్టి భగవంతుడు అనుకున్నప్పటికీ, ఆయన చేయు కార్యములు అనేక సంశయములు రేకెత్తించునవిగా ఉండును. ఆయన జీవిత విధానమంతా ఇతడు భగవంతుడు కాదని నిరూపణతో ఉండుట వలన ఎవరూ గుర్తించలేరని చెప్పవచ్చు.

గలలియలో ప్రభువు 30 సం॥ జీవించిన చరిత్ర మనకు తెలియదు. ఒకవేళ తెలిసుంటే ప్రభువు చరిత్ర, కృష్ణుని చరిత్రల మధ్య ఏకత్వము, భిన్నత్వము తెలిసేవి. కానీ తెలియనివ్వలేదు దేవుడు. మనము ఈ రోజు చూస్తున్న సూర్యుడు ఐదు నిమిషాలు ఉదయించకపోతే కొన్ని వేల జీవరాశులు చనిపోతాయి. అటువంటిది దేవుని జ్ఞానము దేవుడు మనిషిగా వచ్చి ధర్మములు తెలియజేయకపోతే రోజుకు కొన్నివేల మంది ఉగ్రవాదులుగా మారిపోతారు. దేవుని ధర్మాలకు గ్లాని ఏర్పడినపుడు దేవుడు వచ్చి దేవుని ధర్మములు తెలియజేస్తున్నాడు కనుక జగతిలో ధర్మము నడుస్తుంది. మాయా ప్రభావము కాస్త తగ్గుతుంది. నిజంగా మాయ అంటే ఏమిటో తెలియాలంటే, మాయ ఎంత గొప్పదో తెలియాలంటే, అది శరీరములో ఎక్కడుందో తెలియాలాంటే, మాయను దేవుడు ఎందుకు పుట్టించాడో తెలియాలంటే దైవజ్ఞానము సంపూర్ణముగా తెలియాలి. అటువంటి జ్ఞానాన్ని అందజేసిన గురువు ముందు చుట్టూ కంచెను కట్టి, ఆ కంచెకు ఆయన ఆధారమై కంచెలోనికి తోడేలు చర్మం కప్పుకున్న మాయా మనిషిని రాకుండా బలమైన కంచెకట్టాడు.

దేవుని జ్ఞానము నాలుగు భాగాలుగా ఉంటుంది. జ్ఞానము సంపూర్ణమైనది. అది 1) సృష్ఠి విధానము 2) కర్మవిధానము 3) ఆత్మల

వివరము 4) కర్మ కాలబద్ధం అనే నాలుగింటి వివరముతో కూడిన దైవజ్ఞానము. అటువంటి సూక్ష్మజ్ఞానానికి రూపం ఇస్తే అది స్థూల గుర్తుగా కనపడుతుంది. ఆ గుర్తే బ్రహ్మ, కాల, కర్మ, గుణచక్రముల సముదాయము. ఇదే దేవుని గుర్తు. ఇది ప్రతి ఒక్కరికి నుదుటన కలదు. దైవజ్ఞానానికి ఉండే శక్తే దైవచిహ్నానికి ఉంటుంది. అటువంటి చిహ్నాన్ని తెలియజేసిన వాడే గురువు. కావున ఇంతటి మహోన్నతమైన దైవజ్ఞానము ఈ రోజు ఒకే ఒక **"త్రైత సిద్ధాంతము"** ద్వారా తెలియబడుచున్నది. కావున ఇది మతాతీత బోధ, సర్వమానవులకి సంబంధించిన జ్ఞానము ఇది.

మధ్య దైవగ్రంథము (బైబిల్) లో యోహాను వ్రాసిన ప్రకటన 9వ అధ్యాయములో 4వ వాక్యము **(9-4) "నొసళ్లయందు దేవుని ముద్రలేని మనుష్యులకే తప్ప భూమిపైనున్న గడ్డికైనను ఏ మొక్కలకైనను మరి ఏ వృక్షమునకైనను హాని కలుగజేయకూడదని వాటికి ఆజ్ఞ ఇయ్యబడెను."**

అంతిమ దైవగ్రంథము (ఖురాన్) లో **(5-2) "విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్ చిహ్నాలనుగానీ, నిషిద్ధమాసమునుగానీ అగౌరవ పరచకండి", (22-32) "అల్లాహ్ చిహ్నాలను ఎవరయినా గౌరవిస్తున్నారంటే అది వారి హృదయాలలోని భక్తి భావన వల్లనే సుమా!"**

అటువంటి జ్ఞానము తెలుసుకున్నపుడే మన ప్రయాణం మొదలయినట్లు, ఇదంతా కూడా దేవుని ప్రయాణంలో ప్రాథమిక స్థాయి. అప్పటి నుండి దేవుని రాజ్యం జ్ఞాన చూపుతో తెలుస్తుంది. అది ఎంత గొప్పదో ప్రపంచములో దేనితోనైనా పోల్చలేము. ఆ గొప్పదే నీవు మరియు నేను తెలియగలిగితే ఇక ఏ చీకు చింతా లేదు. ఆ పరంధామం చేరాలని ఆశ కలుతుందా? ప్రియమైన దేవుని బిడ్డలారా! అది ఆశగా మిగలకూడదు.

అది సత్యము కనుక నీవు సత్యమైపోవాలి. ఆ సత్యము వాక్యమై ఉంటుంది. అదే నీవై ఉండాలి. అంత గొప్పదైన దేవుని రాజ్యం కోరుకో! లే! ఒకసారి వెనుతిరుగు, ఒకసారి ప్రయాణం మొదలుపెట్టు, నిన్ను లేవనెత్తి, నడిపించు వాడు నీ తండ్రి ఆ తండ్రి ఎవరంటే, బైబిల్‌లో కూడా ప్రభువు వారు **"తండ్రి అని ఎవరినీ పిలవవద్దు, పరలోకమున ఉన్నవాడే నీ తండ్రి"** అని అన్నారు. నీవు ఆత్మ సంబంధీకుడివి కనుక నీ తండ్రి దేవుడే.

## బైబిల్‌లో యోహాను సువార్త :-

మొదటి అధ్యాయము 1 నుండి 11 వాక్యాలు

ఇక్కడ వ్రాసినది యోహాను గారు, మరియమ్మ కడుపులో ఏసుప్రభువు వారు, ఎలిజబెత్ కడుపులో యోహాన్ గారు ఉన్నారు. వారిద్దరు సుమారు 6 నెలలు తేడా అని బోధకులు చెప్పుచున్నారు. అయితే 6వ వచనములో దేవునివద్ద నుండి పంపబడిన ఒక మనుష్యుడు ఉండును ఆయన పేరే యోహాను అని ఉంది. మరి ఎలిజబెత్ కడుపున పుట్టినాడు కదా! అని అంటే దేవుడు తనను ముందుగూడ ఎన్నుకున్నాడు అని అంటున్నారు. ఎన్నుకున్నాడు అని అంటే దేవుడు ఆయనకి చెప్పాలి కదా! దేవుని వివరము దేవునికి తప్ప మరి ఎవరికీ తెలియదు. దేవునితో నేరుగా ఏ మనిషీ మాట్లాడలేడు. రూపం, పేరు లేని దేవుడు మనిషితో మాట్లాడడు అటువంటప్పుడు యోహాను వెలుగును గురించి సాక్ష్యమిచ్చాడు అనేది ప్రశ్నగా ఉంది.

యోహాను వాక్యం ఉండునని చెప్పాడు గానీ వివరము చెప్పలేదు. ఎందుకంటే వాక్యం ఎవరైనా చెప్పవచ్చు కానీ వాక్య వివరము గురువే చెప్పాలి. దేవుడు ద్వాపరయుగం చివరిలో వచ్చి గురువుగా తెలియజేసినదే

"త్రైత సిద్ధాంత భగవద్గీత". సృష్టి ఆదినుండి పద్యముల, పాటల రూపంలో ఉన్న 'జపర' జ్ఞానమే భగవద్గీతలో కూడా ఉన్నది. ఇదే తౌరాత్ గ్రంథము అనే పేరుతో ఖురాన్ (5-46)లో గలదు.

**భగవద్గీతలో దేవుని చేరే మార్గాలు రెండు గలవు అవి....**

**1. కర్మయోగము (కర్మ అంటని విధానము)**

**2. బ్రహ్మయోగము (ఆత్మదర్శనం పొందే విధానము)**

ఆ రోజు చెప్పిన యోహాను కూడా గొప్ప బ్రహ్మయోగి కనుక యోగము ద్వారా ఆత్మదర్శనము పొందిన యోహాను, ఆ వెలుగును చూచానని సాక్ష్యమిచ్చాడు. "ఆ వెలుగును చీకటి గ్రహించలేదు" అని అన్నాడు. అజ్ఞానంతో ఉన్న మనుషులు ఆ విధానాన్ని (బ్రహ్మయోగాన్ని) తెలియలేరు అని అర్థము. అందుకే ఆయన పొందిన ఆత్మానందాన్ని "బ్రహ్మానందం" అని కూడా అంటారు. సహస్రారంలో జీవుడు ఆత్మతో చేరిన చేరికనే 'యోగం' అంటారు. ఇలాంటి బ్రహ్మయోగియే శ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారు. ఆయన కూడా కాలజ్ఞానము పేరిట జరుగబోవు భవిష్యత్‌ను చెప్పాడు. కాని ఇది జ్ఞానము కాదు. కేవలము భవిష్యత్ మాత్రమే.

అలాగే యోహాన్ కూడా వెలుగును గురించి సాక్ష్యమిచ్చుట కొరకు వచ్చినట్లుంది. ఆ వెలుగు ఫలానా అని చెప్పలేదు. ఎందుకనగా! పొందిన ఆనందం మరలా చెప్పుటకు అవకాశము లేదు కనుక ఆత్మప్రేరణ ద్వారా వాక్యము చెప్పాడుగానీ దాని వివరణ చెప్పలేదు, చెప్పలేరు కూడా! వారు చెప్పేదానిని గూఢార్థముగా ఆత్మ వారి ద్వారా చెప్పించింది. కానీ వాటి వివరణ చెప్పలేదు. ఎందుకంటే దేవుని విషయము దేవునికే తెలుసు, ఏ మనిషీ చెప్పలేడు.

ఇంకో రహస్యము ఏమనగా! దేవుడు మూడు ఆత్మలుగా విడిపోయాడు కనుక సృష్టిని కూడా మూడు రకాలుగా సృష్టించాడు. (దేవుడు ముగ్గురిగా లేడు, మూడవ పురుషుడుగా ఉన్నాడు) కనుక దేవుడు కూడా మూడుసార్లు జన్మిస్తేనే ఒక రాక అవుతుంది. అందువల్ల మొదటి జన్మలో శ్రీకృష్ణునిగా వచ్చి ధర్మాలు ఇవి అని తెలియజేసి పోయాడు, తర్వాత రెండో రాకలో ఏసుప్రభువుగా (క్రీస్తు)గా వచ్చాడు. అపుడు చెప్పిన జ్ఞానమంతయూ గూఢార్థముతో చెప్పియుంటిని అన్నాడు. తర్వాత చెప్పనివి, చెప్పాల్సిన సంగతులు ఆదరణకర్త రూపంలో వచ్చినపుడు తెలియజేయబడతాయి అన్నాడు. కనుక ఆ ఆదరణకర్త గురువు రూపంలో బోధించి జ్ఞాన సమగ్రతను తెలియజేస్తాడు. అపుడు దేవునికి మూడు జన్మలు పూర్తి అయి ఒక రాక అగును.

బైబిల్‌నందు నేను ప్రళయ కాలమందు వస్తానంటే ఇంతవరకు మనకు అర్థము కాలేదు. భూమి, ఆకాశము లేకుండాపోవడమే ప్రళయమైతే అపుడు అందరూ లేనప్పుడు దేవుడు వచ్చి ఏమి చేస్తాడు. ఏసుప్రభువు వారు చెప్పిన ప్రళయం అర్థము కావాలంటే శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి సంచలనాత్మక రచన **'సమాధి'** అను గ్రంథాన్ని చదవండి. అందులో గొప్ప రహస్యము తెలియబడింది. మేము కూడా త్రైత సిద్ధాంత జ్ఞానాన్ని కాపీ చేసి మరొక చోట పేస్ట్ చేస్తున్నాము. అంతకు తప్ప మా ఆలోచన ఏమీ లేదు. ఇకపోతే దేవునితో సాటిలేని ఎవరిని చెప్పరాదు. యోహాను అయినా, మత్తయి అయినా ఎవరైనా జీవులు మాత్రమే!

ఇక ఆదియందు వాక్యము ఉండును. వాక్యము దేవునివద్ద యుండును. ప్రథమ దైవగ్రంథము వచ్చి 5150 సం॥ గడిచింది. ఆ గ్రంథములో అక్షర పరబ్రహ్మయోగములో అక్షరం అనగా 'నాశనం లేనిది'

అని అర్థము. ఆదియందు వాక్యముండును అన్నా, నాశనము లేనిది అన్నా ఒకే అర్థము. నాశనము లేనిది దైవము కనుక, వాక్యము జ్ఞానము కావున జ్ఞానము దేవుని దగ్గరే ఉంది. కావున భగవద్గీతలో ఏదైతే ఉందో అదే బైబిల్‌లో ఉన్నది. అటువంటపుడు రెండూ ఒకటే కదా!

క్రైస్తవ సోదరులారా! మీరేమంటారు. మతం అనే పొర తొలగించి చూడండి. జ్ఞానము ఎంత గొప్పగా, ఎంత సమానంగా ఉందో, ఇకపోతే ఆ రోజు యోహానుగారు గొప్పయోగి కనుక ఆయన అభ్యాసం వలన అనుభవించిన విషయము తెలియజేశారు కానీ వివరణ ఇవ్వలేదు. మరి మీరు ఎలా వివరణ ఇస్తునారు అని అంటే మాకు మేము ఆలోచించి చెప్పినది కాదు. మా గురువుగారు త్రైత సిద్ధాంత ఆదికర్త రచించిన గ్రంథములనుండి చెప్పడం జరిగింది. ఆ ఘనత ఆయనదే తప్ప మరి ఎవరిదీ కాదు.

యోహాను సువార్తనందు 1వ అధ్యాయములోగల వాక్యానికి వివరాన్ని సంపూర్ణముగా మా గురువుగారు తెలియజేసినటువంటి "ప్రథమ దైవగ్రంథము భగవద్గీత"లో వివరాన్ని క్రింద పొందుపరుస్తున్నాము చూడండి...

"సృష్ఠికి పూర్వము నేడున్న శూన్యముకానీ, గాలిగానీ, నీరు, భూమిగానీ ఏమీ లేవు. అది ఎవరి ఊహకు, ఎవరి మేథస్సుకు అందని స్థితి. ఏదీ లేని ఆ స్థితిని ఎవరూ పోల్చుకోలేరు. అప్పుడున్నదంతా దైవమే. దైవమును ఎవరుగానీ ఇట్లున్నదని చెప్పలేరు. ఏమీకాని స్థితిని దేవుడని మీరెందుకు చెప్పుచున్నారు అని ఎవరైనా నన్ను ప్రశ్నించవచ్చును. సృష్ఠికి ముందు దేవుడని చెప్పుటకు మీకు ఒక్క ఆధారమైన గలదా? అని

అడుగవచ్చు. దానికి మా జవాబు ఏమనగా! సృష్టిలేని అగమ్యగోచర స్థితినే దేవుడని చెప్పుటకు కొంత ఆధారము కలదు. సృష్టి తర్వాత ఆకారము లేని దేవునికి సృష్టికి పూర్వము ఆకారము ఉండెడిది. ఎవరూ ఊహించలేని స్థితియే అపుడు దేవుని ఆకారంగా ఉండేది. సృష్టి తర్వాత పేరులేని దేవునికి సృష్టికి పూర్వము తెలియని స్థితియే పేరుగా ఉండేది.

సృష్టి తర్వాత దేవునికి ముఖ్యముగా మూడు ధర్మాలు కలవు. ఆ మూడిటిని వరుసగా కలిపి చెప్పితే రూప, నామ, క్రియా రహితుడని చెప్పవచ్చును. ఇపుడు సృష్టి ఉన్నంత కాలము దేవునికి రూపం లేదు, పేరు లేదు, పనియూ లేదు. అందువల్ల ఈ మూడు ధర్మములకు విభిన్నముగా సృష్టి పూర్వము దేవుడున్నాడంటే, అపుడు ఆయనకు రూపం ఉంది, పేరు ఉంది, పని ఉందని చెప్పవచ్చు. అందువలన సృష్టికి ముందు దేవుడు రూప, నామ, క్రియా సహితుడని చెప్పవచ్చును. అప్పుడు మూడింటికీ సహితుడయితే, ఇపుడు మూడింటికీ రహితుడిగా ఉన్నాడు. అప్పుడు రూప, నామ, క్రియా సహితుడని చెప్పుటకు, చూపుటకు ఆధారమేమైనా ఉన్నదా అంటే! ఉన్నదనియే చెప్పవచ్చును. ఆనాడు ఆయనకు (దేవునికి) క్రియ (పని) ఉన్నదని చెప్పుటకు ఈనాడు మనందరికీ కనిపించు ప్రపంచమే సాక్ష్యము. ఆనాడు లేని దానిని సృష్టించి ఉంచడం పనియే కదా! దేవుని చేత సృష్టింపబడిన ప్రపంచమే దేవుని క్రియకు ప్రతి రూపమని చెప్పవచ్చును. ఒక పని జరుగుటకు ముందు దానికి సంబంధించిన యోచన రావలెను. ఒక ఆలోచన వచ్చిన తర్వాత దాని ప్రకారము పథకం వేయబడి, పథకం ప్రకారము పనిని చేయవలసి ఉండును. ఒక పథకం ఉంది అని అంటే దానిని రచించు బుద్ధి ఉండాలి. బుద్ధి ఉంటే దానిని క్రియా రూపం చేయుటకు, ఆ విషయమునకు బయటికి

తెచ్చు మనస్సు కూడా ఉండాలి. సృష్ఠికి పూర్వమున్న దేవునికి మనస్సు, బుద్ధి కూడా ఉండేది. ఈ విషయము మనకు తెలియుటకు భగవద్గీతలో విభూతియోగము అను అధ్యాయములో 6వ శ్లోకమందు ఈ విధముగా చెప్పాడు చూడండి...

*శ్లో॥ మహర్షయ స్సప్తపూర్వే చత్వారో మనవస్తథా ।*
*మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాఃప్రజాః ॥*

ఈ శ్లోకమునందు లోకములోని ప్రజలెల్ల నాయొక్క మనోభావము చేత పుట్టారని చెప్పడము జరిగినది. దీనినిబట్టి దేవునికి మనస్సు, బుద్ధి, మొదలగు సూక్ష్మశరీరము ఉండేదని, అది సూక్ష్మము కాబట్టి ఎవరికీ తెలియదని చెప్పవచ్చును. సృష్ఠికి పూర్వము రూప, నామ, క్రియలు గల దేవుడు సృష్ఠి తర్వాత రూప, నామ, క్రియలు లేనివాడుగా మారిపోయాడు. సృష్ఠికి ముందున్న దేవుని ధర్మములు సృష్ఠి తర్వాత భిన్నముగా ఉండుటకు దేవుడే నిర్ణయించుకొన్నాడు. అందువలన భగవద్గీతలో తనను (దేవున్ని) అవ్యక్తుడని చెప్పుకొన్నాడు. అన్ని విధములా అవ్యక్తముగా ఉండుటకు తనకు రూప, నామ, క్రియలు లేకుండా చేసుకున్నాడు. అందువలన ప్రపంచములో ఎవరైనా దేవున్ని రూప, నామ, క్రియారహితుడని చెప్పవలెను. అదియే నిజమైన దేవుని ధర్మము.

ఇక్కడ కొందరికి మరియొక ప్రశ్న రావచ్చును, అదేమనగా! దేవుడు సృష్ఠికి పూర్వము సూక్ష్మముగా ఉండి ఆకారము, పేరు, పని కల్గి ఉన్నాడని చెప్పారు. దేవుడు అన్ని విధముల సూక్ష్మముగా ఉండుట వలన ఆయన ఎవరికీ తెలియుటకు వీలులేదు. సృష్ఠికి పూర్వము మనుషులే లేరు, కావున ఆయనను (దేవున్ని) ఎవరూ చూడలేదు. ఒకవేళ ఇప్పుడు ఎవరైనా

తెలియుటకు ఇప్పుడు ఆకారముగానీ, పేరుగానీ, పనిగానీ లేదు. అందువల్ల ఆయనను ఎవరూ తెలియలేరు. దేవునికి రూప, నామ, క్రియలు ఉన్నప్పుడు మనుషులు లేరు. మనుషులున్నప్పుడు దేవునికి రూప, నామ, క్రియలు లేవు. అందులన మనిషి అనబడు ఎవడుగానీ దేవున్ని తెలియ లేడు. దేవుని విషయము ఏమాత్రము మనిషికి తెలియదు. దానిప్రకారము దేవుని గురించిన విషయంగానీ దేవుని జ్ఞానమును గానీ, మనిషి అయినవాడు ఎవడూ చెప్పలేడని తెలియుచున్నది. సందార్భనుసారము చెప్పుకుంటే దేవుని విషయము దేవునికి తప్ప, ఏ మనిషికీ తెలియదని ఒక మూల గ్రంథములో చెప్పబడింది. అంతిమ దైవ గ్రంథము ఖురాన్‌లో 3వ సూరాయందు, 7వ ఆయత్‌లో **"దేవుని జ్ఞానము దేవునికి తప్ప మరి ఏ మానవునికీ తెలియదు"** అని కలదు. దేవుడు సృష్టి పూర్వము ఆకారముతో యున్నా సూక్ష్మముగా ఉండువాడే, ఇపుడు ఆకారము లేకున్నా సూక్ష్మముగా యుండువాడే. అందువలన ఏ మనిషికి దేవుడుగానీ, దేవుని పూర్తి సమాచారముగానీ తెలియదనియే చెప్పవచ్చును. అటువంటప్పుడు ఒక మనిషి అయిన శ్రీకృష్ణుడు "దేవునికి మనస్సు, బుద్ధి ఉందని ఆయన సంకల్పం చేతనే జగతినే సృష్టించాడని" చెప్పితే దానిని నిజమని మనమెలా నమ్మాలి? ఆయన చెప్పిన భగవద్గీతను నిజమని ఎలా విశ్వసించాలి? దేవుని సమాచారమైన దేవుని జ్ఞానముగానీ, దేవుని ధర్మములుగానీ దేవునికి తప్ప ఇతర ఏ మానవునికీ తెలియదని దేవుడు చెప్పినప్పుడు, మనిషి అయిన కృష్ణుడు చెప్పిన దానిని ఎందుకు నమ్మాలి? అని ప్రశ్నించవచ్చును.

దానికి మా సమాధానము ఏమనగా! మీరు అడిగిన ప్రశ్న చాలా గొప్పది అది ఎంత గొప్పదో దానికి సమాధానము కూడా అంతే గొప్పగా ఉన్నది చూడండి. దేవుని మాటయే శాసనము. అందువలన ఆయన

మాట పూర్తి సత్యం. ఆయన సృష్టి పూర్వము రూప, నామ, క్రియలుగల వాడనీ, తర్వాత రూప, నామ, క్రియలు లేవని చెప్పినవారు మనిషే, దేవుడు నేను ఇటువంటి వాడనని ఎవరితోనూ చెప్పలేదు. ఆయనను గురించి మనకు సమాచారమిచ్చినది మొదట భగవద్గీత. ఆ భగవద్గీతను చెప్పిన వాడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుడు ఒక మనిషి అయినందున దేవుని విషయము దేవుని తప్ప ఏ మనిషికీ తెలియదను వాక్యమునుబట్టి శ్రీకృష్ణుని మాటను ఎందుకు నమ్మాలి? భగవద్గీతలో నిజమైన దేవుని జ్ఞానమున్నదా? అని అనుమానము రాక తప్పదు. కృష్ణుడు మనిషి అయినందున ఆయన మాటలను విశ్వసించకూడదు అని, కొందరు వాదించుటకు అవకాశము కూడా కలదు. ఈ విషయమై నన్ను అడిగితే నేను ఏమి చెప్పుచున్నానంటే? కృషుడు మనిషి అయితే ఆయన మాటలన్ని అసత్యము అగును. ఒకవేళ కృష్ణుడు మనిషి కాకపోతే ఆయన మాటలను పూర్తిగా నమ్మవచ్చును. అయితే మొత్తము ప్రపంచముకంతటికీ తెలుసు కృష్ణుడు ఒక మనిషియనీ, అతను కూడా ఒక తల్లికి పుట్టిన బిడ్డయనీ, అందరివలె నిద్ర, మెలుకువ, మైథునము (మిథునం లేక స్త్రీ సాంగత్యము) గల మనిషి అని అందరూ చెప్పగలరు. దేవుని విషయము దేవునికి తప్ప ఏ మనిషికీ లేక మనిషి అయినవానికి ఎవనికీ తెలియదను వాక్యముననుసరించి, దేవుని విషయమును (జ్ఞానమును) దేవుడే చెప్పాలి తప్ప, ఎవరూ చెప్పలేరని తెలియుచున్నది. అయితే ఇక్కడ ఒక చిక్కు వచ్చిపడింది. అది ఏమనగా! దేవుడు స్వయంగా ఎవరితోనూ మాట్లాడడు. "దేవుడు నేరుగా ఎవరితోనూ మాట్లాడడు" అను విషయము అంతిమదైవగ్రంథమైన ఖుర్ఆన్ గ్రంథములో 42వ సూరా, 51వ ఆయత్‌లో చెప్పబడింది.

దేవుడు ఎవరితోనూ మాట్లాడక, తన విషయము చెప్పనప్పుడు, ఏ మనిషికీ దేవుని విషయము తెలియనప్పుడు, దేవుని విషయము

మానవులకు తెలిసే అవకాశమే లేకుండా పోవును. అయితే నా విషయము నాకు తప్ప ఎవరికీ తెలియదని చెప్పిన దేవుడే భగవద్గీతయందు జ్ఞానయోగ మను అధ్యాయములో 7,8 శ్లోకములందు ఎప్పుడు నా విషయం భూమిమీద తెలియదో, అప్పుడు నేను వచ్చి నా జ్ఞానమును తెలియజేస్తానని చెప్పాడు. అంతేకాకుండా ఏ యుగములోగానీ నా ధర్మములు భూమిమీద తెలియకుండా పోతే, అపుడు వచ్చి తెలియజేస్తానని రెండు శ్లోకముల రూపంలో చెప్పడం జరిగింది. భూమిమీద అనేక ప్రాంతాల్లో మనుషులు ఉన్నారు. ఒక్కొక్క ప్రాంతములో ఒక్కొక్క భాష ఉండటం మనకు తెలిసిన విషయమే, ఏ భాష తెలిసిన మనుషులు ఆ భాషలోనే మాట్లాడితే వారికి విషయము అర్థమవుతుంది. ఒక భాష తెలిసిన వానికి మరియొక భాషలో ఏమి చెప్పినా అతనికి అర్థము కాదు. అందువలన దేవుడు వచ్చి తన విషయమిది అని చెప్పదలుచుకున్నా, వినేవానికి తెలిసిన భాషలో చెప్పవలసి ఉండును. అంతేకాక వినేవాడు మనిషి అయినందున చెప్పేవాడు కూడా మనిషే అయి ఉండాలి. అలా కాకుండా దేవుడు ఏదో రూపములో వచ్చి ఏదో భాషలో చెప్పితే, మనిషికి ఏమి తెలియకుండా పోవును. చెప్పిన విషయము అతని వరకూ చేరదు. అందువలన చెప్పేవాడు మనిషై ఉండాలి. చెప్పే భాష కూడా వినేవానికి తెలిసినదై ఉండాలి.

ఇదంతయూ చూస్తే దేవుని జ్ఞానము దేవునికే తెలిసినా, ఏ మనిషి చెప్పలేకున్నా, దేవుడు దేవునిగా రాకుండా మనిషివలె మారువేషములో వచ్చి చెప్పిపోవచ్చును కదా! అలా చెప్పితే దేవుడు దేవునిగా ఎవరితోనూ నేరుగా మాట్లాడక మనిషీ ఆకారములో మాట్లాడినట్లు అగును. అంతేకాక తన విషయము ఏ మనిషి చెప్పలేదు కనుక తానే చెప్పినట్లు అగును. దేవుడు మారువేషములో మనిషివలె వస్తే ఆయన ధర్మమునకు ఎటువంటి

భంగం కలుగకుండా తానే స్వయంగా చెప్పినట్లు అగును. తాను తానుగా చెప్పనన్నాడుగానీ మనిషివలె మారువేషములో కూడా చెప్పనని ఎక్కడా లేదు. ఖుర్ఆన్ గ్రంథములో 3వ సూరా (ఆలి ఇమ్రాన్‌లో) 7వ ఆయత్‌నందు **"శ్రద్ధ, బుద్ధికలవాడు నా జ్ఞానమును గ్రహించుకుంటాడు"** అని చెప్పాడు. శ్రద్ధ ఉన్నవాడు గ్రహించుకుంటాడు. అన్నప్పుడు దేవుడు ఏదో ఒక రూపములో తన జ్ఞానమును తానే తెలిపాడనేగా అర్థము. దేవుని జ్ఞానము భూమిమీద మనుషులకు మూడు రకాలుగా తెలియజేయబడును అని ఖురాన్ గ్రంథములోనే 42వ సూరా, 51వ ఆయత్‌నందు కలదు. అందులో ఒకటి శబ్దము ద్వారా, రెండు తెర వెనుక నుండి చెప్పించడము, మూడు స్వయముగా దేవుని దూత ద్వారా చెప్పించడము కలదు. శబ్ధము ఆకాశము నుండి వస్తున్నది, అందువలన జ్ఞానము ఆకాశములో నుండి శబ్దరూపములో వచ్చి చేరడము మొదటి రకము. మొదటి రకములో ఆకాశము నుండి వచ్చు శబ్దము ఎవరినుండి వచ్చినదో ఎవరికీ తెలియదు. అయినా మనము శూన్యమునందు అణువణువునా వ్యాపించి యున్న దైవశక్తి నుండి వచ్చినదని చెప్పవచ్చును. మొదటి రకము ఎవరికి అర్థముకాని విషయము. రెండవది తెర వెనుక నుండి చెప్పించడము అని కలదు. తెరవెనుక అంటే కనిపించక ఉన్నవానిని తెరవెనుక ఉన్నట్లు చెప్పవచ్చును. కనిపించకుండా ఎవరు మాట్లాడి జ్ఞానమును చెప్పినా అది తెరవెనుకనుండి చెప్పినట్లు అగును. ఒకప్పుడు సూర్యుడు ఒక గ్రహమై యుండి సూక్ష్మముగా భూమిమీదికి వచ్చి కనిపించక ఇతరులనుండి మాట్లాడి జ్ఞానమును చెప్పడము జరిగినది. సూర్యుడు మనువునకు చెప్పినది తెర వెనుక నుండియేనని చెప్పవచ్చును. సృష్ట్యాదిలో జ్ఞానము వాణి ద్వారా (శబ్ధము ద్వారా) సూర్యునికి తెలియబడగా, సూర్యుడు తనకు తెలిసిన జ్ఞానమును

చాటున ఉండి, తాను స్వయముగా కనిపించ ఇతరుల శరీరము నుండి పలికి మనువునకు చెప్పడము జరిగినది. ఇట్లు రెండు రకములుగా ప్రపంచములోనికి దేవుని జ్ఞానము, ప్రవేశించగా, తర్వాత మూడవ విధానమైన దూతద్వారా కూడా భూమిమీదకి రావడము జరిగింది. దేవుడు మూడు విధముల తన జ్ఞానమును తెలియజేస్తానని చెప్పినా, ఆ విధానము లను నేటికీ మనిషి గుర్తించలేక పోయాడు. మొదటి విధానమును గురించి ఏమాత్రము మనుషలకు తెలియకుండా పోయినది. ఇక రెండవ విధానము ఎటువంటిదో తెలియక దానినే మూడవ విధానముగా పోల్చుకున్నారు. ఇకపోతే దూత ద్వారా చెప్పించడము అను విధానమును పూర్తిగా తెలియక రెండవ దానినే మూడవ దానిగా చెప్పుకోవడము జరుగుచున్నది.

వివముగా చెప్పుకుంటే దేవుడు ఏమాత్రము పని చేయనివానిగా ఉంటూ, తన జ్ఞానమును స్వయముగా తాను కాకుండా ఇతరుల చేత చెప్పించినట్లు తెలియజేశాడు. ఒక విధముగా తెలియజేసినది దేవుడే! అయినా ఈ మూడు విధానముల్లో దేవుడే చెప్పాడనుటకు వీలులేదు. అయినా లోతుగా ఆలోచిస్తే దేవుడు తప్ప ఎవరూ తెలియజేయుటకు అవకాశము లేదు. గ్రుడ్డిగా మాట్లాడితే ఒక విధము, దృష్ఠిగా మాట్లాడితే మరొక విధము. ఇదింతేయని ఎవరూ తేల్చి చెప్పలేరు.

దేవుడు చెప్పిన మూడు విధానములలో మొదటిది శబ్దము ద్వారా తెలియజేస్తాను అనునది, సృష్ట్యాదిలోనే జరిగిపోయినది. ఆకాశములో సూర్యునికి శబ్దము ద్వారా దేవుని జ్ఞానము సంపూర్ణముగా తెలియబడింది. ఈ విషయము భగవద్గీతలో జ్ఞానయోగము అను అధ్యాయమునందు మొదటి, రెండు శ్లోకములలో కలదు చూడండి.

*శ్లో॥ ఏవం పరంపారప్రాప్త మిమం రాజర్షయో విదుః ।*
*సకాలే నేహ మహతా యోగో నష్టఃపరన్తప ॥*

**భావము :** 'నేను చెప్పు యోగమునకు సంబంధించిన జ్ఞానము నాశనము లేనిది. అటువంటి జ్ఞానమును మొదట (సృష్ట్యాదిలో) నేను సూర్యునికి చెప్పియుంటిని. సూర్యుడు తనకు తెలిసిన జ్ఞానమును భూమిమీద మనువు అను మహర్షికి చెప్పగా, మనువు ఇక్ష్వాకుడు అను రాజుకు తెలియజేశాడు. ఈ విధముగా ఒకరికొకరు తెలుసుకొనుట వలన రాజులు, ఋషులు, ప్రజలందరూ తెలుసుకున్నారు. ఈ విధముగా అందరికీ తెలిసిన జ్ఞానము కాలక్రమమున నేడు ఎవరికీ తెలియకుండా పోయినది.

భగవద్గీతలో కృష్ణుడు చెప్పిన ఈ రెండు శ్లోకములలో దేవుడు ఖుర్ఆన్ గ్రంథములో **42వ సూరా, 51వ ఆయత్‌నందు "మీకు నా జ్ఞానమును మూడు విధముల తెలియజేస్తాను"** అనిన మాటలో మొదటి రెండు విధములు మొదటి శ్లోకములలోనే కలవు. అందులో ఒకటి వహీ (వాణి) ద్వారా అనిన మాట, వహీ అనగా శబ్ద సందేశము అని అర్థము. సృష్ట్యాదిలో సూర్యునికి తెలియబడినది ఆకాశములోని శబ్దము ద్వారానే సూర్యునివద్ద కూడా ఆకాశము ఉండుట వలన ఆకాశములోని శబ్దమును సూర్యుడు సులభముగా వినగలిగాడు. సూర్యుడు ఒక గ్రహము, సూర్యుని శరీరము మండే అగ్నిగోళము. గ్రహించుకొను శక్తి గలది గ్రహము. సూర్యుడు ఒక గ్రహము అయినందున శబ్దము ద్వారా వచ్చిన జ్ఞానమును సూర్యుడు వినగలిగాడు. సూర్యుడు గ్రహించుకొన్న దానిని భూమిమీద ఉన్న మనువు అను మహర్షికి తెలుపడము జరిగింది. సూర్యుడు సూక్ష్మముగా వచ్చి, తాను కనిపించక ఇతరుల శరీరమునుండి మాట్లాడుచూ జ్ఞానమును మనువుకు తెలియజేయడమైనది. సూర్యునికి శబ్దము ద్వారా జ్ఞానము

తెలియజేయడమను విధానము దేవుడు తెలియజేయు మూడు విధానములలో మొదటిదికాగా, సూర్యుడు మనువుకు జ్ఞానమును ఇతరునుండి చ్పెడము, దేవుడు తెలియజేసిన మూడు విధానములలో రెండవదైన తెరచాటు నుండి తెలుపుడమని గ్రహించవలెను. ఈ విధముగా రెండు విధానములు అమలు జరుగగా కృష్ణుడు వచ్చి అర్జునునికి ప్రత్యక్షంగా చెప్పడము వలన దేవుడు చెప్పిన మూడవ విధానము కూడా నెరవేరినది. నా దూత ద్వారా జ్ఞానము తెలియజేస్తాను అను మూడవ విధానము కృష్ణుడు అర్జునునకు చెప్పడము వలన నెరవేరినది. సృష్ట్యాదిలో మొదటి విధానము జరుగగా, తర్వాత కొంత కాలమునకే రెండవ విధానము ద్వారా భూమిమీద దేవుని జ్ఞానము తెలియబడినది. తర్వాత మనకు తెలిసిన ఐదు వేల సంవత్సరాల పూర్వము మూడవ విధానము ద్వారా భగవద్గీత గ్రంథము బయటకు వచ్చినది. ఈ విధముగా మూడు పద్ధతులు గతములోనే నెరవేరాయని చెప్పవచ్చును.

గతములో మూడు పద్ధతులు జరిగిపోయాయి గదాయని, ఇక జరుగవనుటకు వీలులేదు. భవిష్యత్‌లో కూడా జరుగవచ్చును. అయితే ఆకాశవాణి చెప్పడము ఒకమారే ఉంటుందనుకుంటాను. ఎందుకంటే ఒకమారు శూన్యము నుండి చెప్పబడిన తర్వాత దానిని ఎన్నిమార్లయినా చెప్పవచ్చును. ప్రత్యక్షముగా కనిపించు దూతగాగానీ లేక పరోక్షముగా కనిపించక తెరచాటు నుండి చెప్పు గ్రహముగాగానీ, దేవుని జ్ఞానమును ఎన్నిమార్లయినా చెప్పుకోవచ్చును. అయితే ఆకాశవాణి ద్వారా చెప్పబడునది ఇతరుల ప్రమేయం లేకుండా వచ్చునది, కావున అది ఒకమారే చెప్పబడును. మనకు తెలిసినంతవరకు గతంలో ఒకమారు ఆకాశవాణి చెప్పిన జ్ఞానము ఇంతవరకు రెండవమారు చెప్పలేదు. అట్లే సూర్యగ్రహము మొదట మనువుకు

చెప్పిన తర్వాత ఇంతవరకు సూర్యుడు భూమిమీదకి వచ్చి ఎక్కడా చెప్పినట్లు కనిపించడంలేదు. అయితే సూర్య(గహము తాను తెలుసుకున్న జ్ఞానమును ఖగోళములోని మిగతా అన్ని (గహములకు తెలియజేసినది. సూర్యుని వలన ఖగోళములోని ఎన్నో కోట్ల (గహములు, అలాగే ఎన్నో కోట్ల భూతములు, ఉపభూతములు తెలుసుకోగలిగాయి. అలా దేవుని జ్ఞానము ఖగోళమంతా వ్యాపించి (గహములు, భూతములందరూ తమను సృష్టించిన దేవున్ని గురించి తెలుసుకున్నాయి. అదే కోవలో జి(బయేల్ అను (గహము కూడా అందరినీ సృష్టించిన దేవుని జ్ఞానమును తెలుసుకొన్నాడు. సూర్యుడు మొదట వాణి ద్వారా తాను తెలుసుకున్న జ్ఞానమును విశ్వవ్యాప్తముగా భూమిమీదకి మనువుకు, ఆకాశములో (గహములకు తెలియజేయడము వలన సూర్యుడు ఆది గురువని పేరుగాంచాడు. జ్ఞానము చెప్పడములో మొదటి వాడు గనుక సూర్యున్ని ఆదిత్యుడని అన్నారు. సూర్య(గహము భూమిమీద భారతదేశములో మనువు అను వ్యక్తికి జ్ఞానమును తెలియ జేసినట్లు మిగతా (గహములు కూడా దేవుని జ్ఞానమును ఒకరికొకరు చెప్పుకోవడము జరుగుచున్నది. అందువలన ఖగోళములోని (గహములు మొదలుకొని భూతములలోని మేఘముల వరకు దేవుని జ్ఞానము తెలియబడి, దేవుని మీద భక్తి కలిగి (శద్ధగా వారందరూ దేవుని పరిపాలనలో భాగమై దేవుని సేవ చేయుచున్నారు.

భూమిమీద మనుషులు మా(తము మనువు ద్వారా పరంపరగా వచ్చిన దైవజ్ఞానమును ద్వాపరయుగము నాటికి పూర్తిగా మరచిపోయి దేవున్ని వదలి దేవతల భక్తిలో పడిపోయి, యజ్ఞయాగాదులు, (వత(క్రతువులు వేదపారాయణములు, తపస్సులలో మునిగిపోయారు. అటువంటి సందర్భములో దేవుని సమాచారమును తెచ్చిన దూతగా కృష్ణుడు, అర్జుననకు

దేవుని జ్ఞానమును బోధించాడు. అలా బోధించునప్పుడు సమయస్ఫూర్తిగా తాను చెప్పు జ్ఞానము మొదట సృష్ట్యాదిలోనే సూర్యునికి తెలియబరచబడిన జ్ఞానమని కృష్ణుడు చెప్పాడు. అలా చెప్పడము వలన ఒకే జ్ఞానము మొదట ఆకాశవాణి ద్వారా తెలియబడి, రెండవమారు తెరచాటునున్న గ్రహముల ద్వారా తెలియబడి, మూడవమారు ప్రత్యక్ష దూత ద్వారా తెలియబడినదని తెలిసినది. ఇట్లు దేవుడు నా జ్ఞానమును మూడు విధముల తెలియజేస్తానని చెప్పినమాట నెవవేరినది. కృష్ణుడు చెప్పిన జ్ఞానము సృష్ట్యాదిలో ఆకాశవాణి ద్వారా సూర్యునికి చెప్పబడిన మొదటి జ్ఞానమని తెలిసినది. అలా సృష్ట్యాదిలో చెప్పబడిన మొదటి జ్ఞానమును సూర్యుని ద్వారా తోటి గ్రహమైన జిబ్రయేల్ గ్రహము కూడా తెలుసుకోగల్గినది. సూర్యుడు భూమిమీద మనువు అనునతనికి తనకు తెలిసిన జ్ఞానమును బోధించినట్లు, జిబ్రయేల్ గ్రహము కూడా తనకు తెలిసిన జ్ఞానమును భూమిమీద ఒక మనిషికి బోధించడము జరిగినది. జిబ్రయేల్ గ్రహము ఎప్పుడు ఎవరికి తన జ్ఞానమును బోధించినది తర్వాత సందర్భానుసారముగా చెప్పగలను.

సూర్యుడు కృతయుగములో మనువుకు అందించిన జ్ఞానము ద్వారప యుగ చివరిలో కృష్ణుడు అర్జునునకు చెప్పడము జరిగినది. అలా ద్వాపర యుగములో చెప్పిన జ్ఞానము వ్యాసుని ద్వారా ఇప్పటికి 5000 సం॥ పూర్వమే గ్రంథరూపమైనది. ఈ విధముగా దేవుని జ్ఞానము మొట్టమొదట గ్రంథముగా బయటకు వచ్చినది. అలా కృష్ణుడు చెప్పిన జ్ఞానము వ్యాసుని చేత రచించబడి గ్రంథమైనది. ఆ గ్రంథము పేరే భగవద్గీత. భగవద్గీత యొక్క జ్ఞానము సృష్ట్యాదిలోనే చెప్పబడిన జ్ఞానము అయినందున మరియు భగవద్గీత భూమిమీద దేవుని జ్ఞానమును గూర్చి వ్రాయబడిన మొదటి గ్రంథమైన దానివలనా, దానిని ప్రథమ దైవగ్రంథమని అంటున్నాము.

ఇక్కడ కొందరికి ఒక ప్రశ్న రావచ్చును. అదేమనగా! కృష్ణుడు చెప్పినపుడు దేవుని జ్ఞానము భూమిమీద ఎవరికీ తెలియకుండా పోయినది కదా! అప్పుడు ఎవరికీ తెలియని జ్ఞానమును కృష్ణుడెలా చెప్పాడు? కృష్ణుడు ఒక మనిషైనపుడు అతనికి దేవుని జ్ఞానమెలా తెలిసినది? అని ప్రశ్న రావడములో తప్పు లేదు. దానికి జవాబును వెదకితే ఇలాగ కలదు. దేవుని జ్ఞానము దేవునికి తప్ప ఇతర మానవులెవరికీ తెలియదని దేవుడు ఒకానొక తన గ్రంథములో చెప్పినమాట వాస్తవమే. అటువంటప్పుడు మనిషి అయిన కృష్ణుడు దేవుని జ్ఞానమును ఎలా చెప్పగలడను ప్రశ్న రాక తప్పదు. దేవుడు తన దూత ద్వారా జ్ఞానమును చెప్పిస్తానను మూడు విధానములలో అదొక విధానమని చెప్పినా, కృష్ణుడు దేవుడు పంపిన దూతయని ఎక్కడా నిరూపించబడలేదు. ఒకవేళ కృష్ణుడు ఎక్కడైనా నేను దేవుని దూతనని చెప్పాడా? లేక దేవుడు పంపగా వచ్చినవాడినని చెప్పాడా? అలా కూడా చెప్పలేదు. అలాంటపుడు సాధారణ మానవుడైన కృష్ణుడు దేవుని జ్ఞానమును ఎలా చెప్పాడు అను ప్రశ్న నిలబడగలదు. ఈ ప్రశ్నకు జవాబుగా ఎవరైనా కృష్ణుని తరుపున వాదించి లేదు కృష్ణుడు దేవుడు పంపిన దూతయేనని, ఆయన దేవుని దూతయిన దానివలన దేవుని జ్ఞానమును చెప్పగలిగాడని చెప్పినా, భగవద్గీతలో కృష్ణుడు తాను దేవదూతనని చెప్పిన దాఖలాలులేవు. అంతేకాక దేవుడు కృష్ణుడుగా వచ్చినవాడు నా దూతయని చెప్పిన వాక్యము కూడా లేదు. అయినా మేము కూడా ఎటూ దారిలేక దేవుని సమాచారమును తెచ్చినదూతగా కృష్ణున్ని చెప్పాము. ఇటు కృష్ణుడు తనను దూతగా చెప్పకపోయినా, దేవుడు కూడా తన జ్ఞానమైన భగవద్గీతలోగానీ, మరెక్కడాగానీ, కృష్ణున్ని దూతగా చెప్పకపోయినా, మీరెందుకు కృష్ణున్ని దూతగా చెప్పారని ఎవరైనా

నన్ను కూడా ప్రశ్నించవచ్చును. దానికి జవాబు చెప్పవలసిన బాధ్యత నాకున్నది. తప్పనిసరిగా జవాబు చెప్పగలను.

భగవద్గీతలో కృష్ణుడు ఒకవైపు దేవుని జ్ఞానమును చెప్పుచూ మరొకవైపు తానే దేవుడనని, తనను మించిన దేవుడు ఇంకొకడు లేడని ప్రకటించుకొన్నాడు. భగవద్గీతను కృష్ణుడు చెప్పినది దేవుని జ్ఞానమును చెప్పుటకా లేక తనను దేవుడని చెప్పుటకా అను ప్రశ్న కూడా రాగలదు. ఈ ప్రశ్నలన్నింటికీ జవాబును వెదుకుచూ పోతే ఒకదారి దొరుకుచున్నది. ఆ దారి ప్రకారము ఆలోచిస్తే ఇలా కలదు. దేవుడు తన దూత ద్వారా తన సమాచారమును తెలియజేస్తానని చెప్పడము వాస్తవమే అయినా, ఆయన తనవద్ద నుండి దూతను పంపుటకు ఆయనవద్ద దూతలు ఎంతమంది ఉన్నారని మనము ఆలోచించవలసియున్నది. అలా ఆలోచిస్తే దేవునివద్ద దేవుడు కాక ఎవరూ లేరు. ఇంకొక విధముగా చెప్పితే దేవున్ని చూచినవాడు ఎక్కడగానీ, ఎవడుగానీ లేడు. అటువంటప్పుడు దేవుని వద్ద ఎవడైనా దూత ఉన్నాడంటే వాడు దేవున్ని చూచును. దేవున్ని చూచినవాడు ఎవడూ లేడన్నప్పుడు దేవునివద్ద ఎవడూ లేడనియే చెప్పవచ్చును. ఎవడైనా జ్ఞానము తెలిసి, కర్మను లేకుండా చేసుకుని దేవునివద్దకు పోయివుండవచ్చును కదా! అని అంటే అటువంటివాడు, దేవునివద్దకు పోవుట నిజమేకానీ, దేవునివద్దకు పోయినవాడు దేవునివద్ద సేవకునిగానో, దూతగానో ప్రక్కన ఉండక దేవుని లోనికి ఐక్యమైపోవును. దేవునివద్దకు పోయినవాడెవడయినా ఆయనలోనికి చేరి ఆయనలో కలిసిపోవడము తప్ప ప్రక్కన ఉండటమంటూ ఉండదు. దానివలన దేవుని సమాచారమును తీసుకునివచ్చు దూత ఎవడూ లేడనియే చెప్పవచ్చును. అటువంటప్పుడు దేవుడు తన దూత ద్వారా తన జ్ఞానమును తెలియచేస్తానని చెప్పినమాట ఏమగునని, దేవునిమాట అసత్యమా అని

ఎవరైనా అడుగవచ్చును. దానికి జవాబు ఏమనగా! దేవునిమాట ఎప్పటికీ అసత్యముకాదు. దేవుడు ఏమి చెప్పినా అది తప్పక నెరవేరి తీరును. ఇక్కడ మనము అర్థము చేసుకోవడములో ఏమైనా లోపము ఉందేమోనని చూసుకోవలసియున్నది. ఆయన మాట నెరవేరుటకు ఏదైనా నిగూఢ భావమున్నదేమో చూచుకొందాము. దేవుడు సృష్ఠి పూర్వము ఉన్నట్లు కాకుండా సృష్ఠి తర్వాత రూప, నామ, క్రియా రహితునిగా ఉన్నాడనుట మనము మరువకూడదు. దేవుడు స్వయంగా నేరుగా ఎవరితోనూ మాట్లాడడు. అందువల్ల తన జ్ఞానమును తన దూత ద్వారా తెలియ జేస్తానన్నాడు. ఉన్నది ఒకే దేవుడై ఎవరూ దూతలు లేనపుడు ఆయన ఆయనగా (దేవుడు దేవునిగా) కాకుండా, మారువేషములో వచ్చి చెప్పడము వలన తన జ్ఞానము ప్రజలకు తెలియుచున్నది. దేవుడు దేవునిగాగాక ఒక మనిషివలె వచ్చుచున్నాడు కాబట్టి దేవుడు స్వయముగా చెప్పినట్లు కూడా కాదు. ఇక్కడ మరియొక మాట గుర్తు చేసుకుంటే ఏ మనిషీ దేవుని జ్ఞానమును చెప్పలేడు. ఏ మనిషికీ దేవుని జ్ఞానము తెలియదు. కనుక చెప్పినవాడు దేవుడేననీ, దీనినిబట్టి దేవుడు పని చేసినట్లే కదాయని ఎవరైనా అడిగితే దేవుడు పనిచేయడని చెప్పుటకు, వచ్చి చెప్పినవాడు దేవుడు కాదు మనిషియనీ, అట్లని మనిషికి దేవుని జ్ఞానము తెలియదని సూత్రముండుట వలన వచ్చినవాడు మనిషివలె ఉన్నా అతను అందరివలె మనిషే కాదు, అట్లని దేవుడూ కాదు, మనిషి రూపములోనున్న భగవంతుడని చెప్పవచ్చును. భగవంతుడనగా ఇటు మనిషీ కాదు, అటు దేవుడూ కాడు. మనిషికంటే ఎక్కువవాడు, దేవునికంటే తక్కువవాడు భగవంతుడు.

దేవుడు దేవుడుగా కాకుండా మనిషివలె మారువేషములో వస్తే అతనిని అప్పుడు భగవంతుడు అనాలి. భగవంతుడు సాధారణ మనిషివలె

ఉండుట వలన ఆయనను దేవుని అవతారముగా ఎవరూ గుర్తించలేరు. భగవంతుడు దేవునికి మారుగా వచ్చినవాడైనందున, ఇతరులు దేవుడని గుర్తించుటకు వీలులేకుండా మానవునివలె వచ్చి, భగవంతుడని కూడా ఎవరికీ తెలియకుండా ఉండువాడు దేవుడే అయినందున, దేవుని జ్ఞానము దేవునికే తెలుసు అను సూత్రము ప్రకారము. దేవుని జ్ఞానము మనిషివలె నున్న భగవంతునికి సంపూర్ణముగా తెలిసియుండును. అందువలన భగవంతుడైన మనిషి సంపూర్ణముగా బోధించగల్గును. భగవంతుడైన మనిషే దేవుడని నా మాటకు సాక్ష్యముగా భగవద్గీతను చెప్పిన మనిషిగా కనిపించు కృష్ణుడు "నేనే దేవున్ని నన్ను మించిన దేవుడు లేడని" భగవద్గీతలో చెప్పడము జరిగినది. తన దూతతో జ్ఞానమును తెలియజేయుదునని దేవుడు ఒకచోట చెప్పినా, తనవద్ద తాను తప్ప మరొకడు ఎవడూ లేనందున తానే దూతగా వస్తున్నాడని మనము తెలియవలసియున్నది. మనుషులను మభ్యపెట్టుటకు తనను దూతగా చెప్పకున్న దేవుడు దూతగాయున్న మనిషిని ఎవరూ గుర్తించనట్లు చేశాడు. దూత లేక భగవంతుడని చెప్పబడువాడు ఎప్పుడు భూమిమీదకి వస్తున్నా, వచ్చినా, వచ్చిపోయినా కూడా ఎవరికీ తెలియకుండా దేవుడు చేయగలడు. ఇతడు దేవుడని ఎటువంటి వానిచేత కూడా భగవంతుడైన మనిషి గుర్తింపబడనట్లు దేవుడు అమర్చి పెట్టి యుండును. ఒకవేళ ఎవడైనా నేను మనిషి ఆకారములోనున్న భగవంతున్ని గుర్తించానని అనగలిగితే, అటువంటి వానిచేతనే ఇతను భగవంతుడు కాడు, ఇతనికి జ్ఞానము తెలియదని అనునట్లు దేవుడు తన మాయచేత చేయగలడు"

చూశారుగా! స్వామివారు సృష్టి విధానము గూర్చి, మాయ గూర్చి ఎంతగొప్ప వివరణ ఇచ్చారో.

ఈ రోజు ఉన్న బోధకులు భక్తులను ఎలా నమ్మించుచున్నారంటే, దేవుని దగ్గర లూసిఫర్ అనే ఒక వ్యక్తి ఉండేవాడు. ఆయన దేవునికి లూసిఫర్‌ను దేవుడు ఆకాశమునుండి త్రోసేసారని చెప్తున్నారు. మా ప్రక్కనే ఉన్న స్నేహితునికి ఒక ప్రశ్న వచ్చింది.

ఆకాశమునుండి తోసిన లూసిఫర్, ఇజ్రాయిల్ దేశములో పడ్డాడా లేక భారతదేశములో పడ్డాడా లేక బ్రిటిష్ దేశములో పడ్డాడా? అని స్నేహితుడు వారిని అడిగితే సమాధానము లేదు. ఒక వైపు అంత ఉండటానికి లూసిఫర్ ఆకాశము అంత ఉన్నాడా? ఒకవేళ అంత ఉంటే త్రోసేయడం జరుగదు కదా! ఈ విధముగా సంశయసహిత జ్ఞానము ఉంటే అది దైవజ్ఞానము కాదు. అసలు జ్ఞానము, మాయ వివరము తెలియాలంటే “త్రైత సిద్ధాంత భగవద్గీతే” ఆధారము.

**(యోహాన్ 8-12) :** నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండునని వారితో చెప్పెను.

ఇక్కడ ఏసు లోకమునకు వెలుగు అన్నపుడు అది ఏ లోకము? బయట కనపడే లోకమా? లేక వేరేగా ఏమైనా ఉందా? అని చూస్తే మూడు లోకాలు అని చెప్పబడుచున్న లోకాలు మూడు గుణ భాగాలే. ఈ గుణ భాగాల మధ్యలో ఆత్మస్థానము. జీవుడు ఈ మూడు గుణాల్లో ఎక్కడో ఒక చోట ఉంటాడు. నీకు ఆత్మజ్ఞానము తెలియబడితే జీవుడు వెలుగుకలిగి ఉండును. ఇక్కడ జీవుడు పురుషుడు, శరీరములో ఇద్దరు పురుషులు గలరు. జీవాత్మ అనే పురుషుడు రవ్వంత ఉంటే, ఆత్మ అనే పురుషుడు శరీరమంతా వ్యాపించి ఉన్నాడు. ఇదే విషయాన్ని భగవద్గీతలో పురుషోత్తమ ప్రాప్తియోగం 16వ శ్లోకములో తెలియబడింది. జ్ఞానము తెలియకపోతే

జీవుడు అంధకారములో ఉన్నట్లే, అందుకే చీకటి (అజ్ఞానం) వెలుగును (జ్ఞానాన్ని) గ్రహించలేకున్నది. అని యోహాన్ అన్నాడు. అందువల్ల చీకటి కావాలా? వెలుగు కావాలా? మీ ఇష్టము.

పరిశయ్యులు ఏమంటున్నారు అంటే 'నీవు సాక్ష్యం చెప్పు కుంటున్నావు. నీ సాక్ష్యము సత్యము కాదని ప్రభువుతో అనగా, అపుడు ప్రభువు వారు ఇలా అంటారు. "నేను ఎక్కడనుండి వచ్చితినో ఎక్కడికి వెళ్ళుదునో నేను ఎరుగుదును. కనుక నన్ను గూర్చి నేనే సాక్ష్యం చెప్పు కుంటున్నాను, నా సాక్ష్యం సత్యము."

కావున దేవుని వివరము దేవునికే తెలుసు. ఎవరికీ తెలియదు. ఎందుకంటే ఆయన ఎక్కడనుండి వచ్చాడో అది ఎవరికీ తెలియదు. పరలోకము అనగా ఈ లోకము కానిది. ఆ లోక సంబంధికుడైన వాడే తెలియజేయాలి కానీ ఏ మనిషీ సాక్ష్యం ఇవ్వలేడు. కానీ ఈ వివరం తెలియనివారు దేవునివద్ద యోహాను ఉన్నాడు, లూసిఫర్ అనే దేవదూత ఉన్నాడు, మనుషులు ఉన్నారు అంటే ఏమి తెలియని బోధకులను (అజ్ఞానులు), జ్ఞానులుగా భావించుకొని క్రైస్తవులందరు మాయజ్ఞానం వైపు పోవుచున్నారు. మనము కూడా గ్రుడ్డిగా వారిని నమ్ముచున్నాము.

దేవున్ని ఎవరూ చూడలేదు. దేనికీ అందనివాడు దేవుడు. అయితే ఈనాటి క్రైస్తవ సమాజమంతా మేము రోజూ దేవునితో మాట్లాడుచున్నాము, మేము దైవాన్ని అనుభవిస్తున్నాము అంటున్నారు. మీరు కర్మలేకుండా చేసుకుంటే నాలోకి ఐక్యమైపోతారు అని చెప్పాడు గానీ, నా దగ్గర మీరు ఉంటారు అని చెప్పాడా? అందుకే జ్ఞానము అర్థము కావాలన్నా దేవుని ఒప్పుదల ఉండాలి. దేవుని ఒప్పుదల ఉంటేనే ప్రకృతి (మాయ) దైవ

మార్గములోకి పంపుతుంది. లేదంటే మాయా మార్గములోనే ఉండి, మేము సరైన జ్ఞానులు అనుకొనేటట్టు చేసి ప్రక్కకి పంపుతుంది. అందుకే దేవుడు ఇలా అంటాడు. **"నేను అనుకుంటే నీవు నీవుగానే ఉంటావు, నేను అనుకుంటే నీవు అంతటా ఉంటావు"**

ప్రభువువారు అంటారు. ఈ లోకపు తెలివితేటలు దేవుని దృష్టిలో వెర్రితనంలాంటివి అని అంటారు. ఎందుకంటే నీతివేరు, జ్ఞానము వేరు ఈ వ్యత్యాసం తెలియక ఈనాటి బోధకులు ప్రపంచనీతినే దైవజ్ఞానంగా బోధిస్తున్నారు. ప్రపంచ విషయములో సరైనదిగా అన్పించేది, దేవుని విషయములో పూర్తిగా తప్పుగా ఉంటుంది. అందువల్ల బుద్ధి, శ్రద్ధతో గ్రహించాలి. మతాన్ని గొప్పగా భావించే బోధకులు, విశ్వాసులు, భక్తులు మతాల మత్తులో ఉన్నారు కానీ, నిజమైన జ్ఞానాన్ని గ్రహించలేకున్నారు. సోదరులారా! ఇప్పటికైనా కళ్ళు తెరవండి. మనము బ్రతికేది 60 లేక 70 సం॥ ఈ జీవితములో ఉండే బలము మనది కాదు, ఒక రోజు అది పోతుంది. అపుడు నీ మతం, నీ కులం, నీ వాళ్ళు అనుకున్న ఎవరూ నిన్ను కాపాడలేరు. ఒకే ఒక్క దేవుడు తప్ప నిన్ను ఆదరించువాడు లేరు. మన శరీరములోనే దేవుడు కోట్లాది రూపాయలు విలువచేసే భాగాలు తయారు చేసిపెట్టాడు. ఆ శరీరాన్ని నడిపించే శక్తిగా అందరికీ సమానంగా ఉన్నారు. అటువంటి దైవాన్ని తెలుసుకోకుండా, మాకు బైబిల్ అంతా తెలుసు, అంటే ఎలా? పాత నిబంధన కొట్టివేయబడినదని కొరంథీ॥ 2వ పత్రిక (3-14,15)లో అంత స్పష్టంగా ఉన్నా వాక్యానికి ఏమిని వివరణ చెప్తారు. ఇంకా మూఢత్వములో అదే పట్టుకుంటే ఎలా? అందువల్ల బైబిల్‌లో ప్రభువు చెప్పిన జ్ఞానము ఉన్నా నాలుగు సువార్తలే ముఖ్యము.

ఇక భగవద్గీత విషయానికి వస్తే శ్రీకృష్ణ పరమాత్మచే ద్వాపర యుగము చివరిలో చెప్పబడింది. అప్పటికే వ్యాసుడు నాలుగు వేదాలు, 18 పురాణాలు రచించాడు. అవి ప్రజలకు బాగా చేరువ అయ్యాయి. ఆ సమయములో వ్యాసున్ని దైవ అంశగా భావించి 'వ్యాసభగవానుడు" అని పిలువబడేవాడు. అటువంటి వ్యాసుడు, శ్రీకృష్ణ పరమాత్మ యుద్ధరంగలో అర్జునునికి తెల్పిన గీతను, అర్జునుడి ద్వారా విని ఎంతో ప్రశ్చాత్తాపం చెందాడు. తాను వ్రాసిన వేదాలు, పురాణాలు అసలు జ్ఞానమే కాదని తెలిసి దైవజ్ఞానాన్ని **'భగవద్గీత'**గా ఆయనే రచించాడు. దీనిని ఆ రోజుల్లోనే చాలామంది వ్యతిరేఖించారు. చూశారా! అజ్ఞానము ఏ స్థాయిలో ఉంటుందో, వ్రాసినవానికంటే దానిని తెలుసుకున్నవారే పూర్తిగా అజ్ఞానములో మునిగిపోయారు.

శ్రీకృష్ణ పరమాత్మ యజ్ఞాలు, దానాలు, తపస్సులు, వేదాధ్యయనం వాటివల్ల నేను తెలియబడనని తెల్పితే, ఈనాటికీ కూడా హిందూవులుగా చెప్పుకుంటున్నవారు వాటినే ఎంతో శ్రద్ధగా చేస్తున్నారు. ఈ విధముగా అన్ని మతాల్లో కూడా జ్ఞానాన్ని గ్రహించలేని మూఢులు తయారై, ఏది జ్ఞానమో, ఏది అజ్ఞానమో కూడా గ్రహించలేకున్నారు.

మాకు తెలిసిన ఒక జ్యోతిష్యపండితుడు అయిన వ్యక్తిని కలిసి స్వామివారు రచించిన **"జ్యోతిష్యశాస్త్రము"** గ్రంథము ఇచ్చి, ఇది చదవండి, మీకు చాలా ఉపయోగపడుతుంది అని చెప్తే మీ గ్రంథాలు మేము చదవము అన్నాడు. ఏమి ఎందుకు చదువరు? అని ప్రశ్నిస్తే "మీ గ్రంథాలు సామాన్య మైనవి కాదు, మేమోదో భార్యాపిల్లలతో హాయిగా ఉండాలనుకుంటున్నాము. మీ గ్రంథాలు మోక్ష మార్గాన్ని చూపుతాయి. గుణతీవ్రత తగ్గించే జ్ఞానము అందులో ఉంది. నాది నావారు అనే మోహగుణం తగ్గుతుంది! అందుకే

నేను చదవను” అన్నాడు. అంతేకాదు “మీ గురువుగారు సామాన్యులు కాదు, దైవసమానులు అని సంబోధించాడు. అంటే గొప్పజ్ఞానము అని తెలిసీ, సత్యము ఉందని తెలిసీ అధర్మాలవైపే పోతున్నారంటే ఈ కాలం మనుషులు ఎలా ఉన్నారో చూడండి.

ప్రజలారా! ఒక్కసారి ఆలోచించండి. మనము పుట్టుకతో మనుషులం, మధ్యలో వచ్చింది మతం. ఎందుకంటే దైవజ్ఞానాన్ని తెలియని వారు సృష్ఠించిన మార్గమే మతం. భగవద్గీతలో ఎక్కడైనా విగ్రహారాధన చేయమని ఉందా? దేవుడు ఒక్కడే అని చెప్పలేదా? దేవుడు సర్వమానవులకి అని జ్ఞానాన్ని మూడు గ్రంథాల రూపంలో ఇస్తే, దానిని మనము మూడు మతాలుగా మార్చుకొని, మతానికొక దేవున్ని పెట్టుకున్నాము. మూడు మత గ్రంథాలు కాదు. భగవద్గీత, బైబిల్, ఖురాన్ ఈ మూడు దైవ గ్రంథాలు. ఈ మూడింటిలో ఒకే దేవుని జ్ఞానమే ఉన్నప్పటికి మనుషులకు ఒకేలా ఎందుకు అర్థము కాలేదు అంటే దేవుడు చెప్పిన ఏ వాక్యం మనిషి బుద్ధికి అందలేదు, కనుక ఈ మూడు దైవగ్రంథాలు దైవాన్ని చేరే మార్గాన్ని బోధించాయి కానీ, మతాన్ని బోధించలేదు. శరీరములో సమానంగా ఉండే ఆత్మ, ప్రకృతి వివరము మనిషికి అర్థము కాలేదు. ఇలా నిజం చెప్తే నిష్ఠూరంగా ఉన్నప్పటికీ అదే సత్యం. మిడిమిడి జ్ఞానంతో ఉన్న మనము అన్నీ తెలుసుననుకుంటున్నాము. కానీ వాస్తవానికి నీవు ఎవరో నీకు తెలుసా?

ఏసుప్రభువువారు శరీరధారియై ఏ మాటలు అయితే చెప్పాడో అవే, యోహాను, మత్తయి, మార్కు, లూకా సువార్తలలో కలదు వాటిని తెలుసుకోండి చాలు. లేకపోతే మీ కర్మ! నేనే ఒక క్రైస్తవుడిగా మోసపోయాను. మీరు అలా మోసపోకండి, దేవునివాక్యము తెలుసుకోండి. నీవు పుట్టినపుడు

నీ తలరాత వ్రాయబడి ఉంది. దానినెవరూ మార్చలేరు. అందుకే ప్రభువువారు ఇలా చెప్పారు "చింతించడం వల్ల ఎత్తును మూరడు పెంచుకోలేవు, తగ్గించుకోలేవు", "నీ తలలోని వెంట్రుకలు లెక్కించబడి ఉన్నాయి" అని అన్నారంటే జరిగే ప్రతిక్షణం ముందే నిర్ణయమై ఉందని అర్థము. అబద్దపు బోధకులు ఎంతసేపు ఆత్మజ్ఞానము చెప్పక సిరిసంపదల గూర్చి, కష్టాలు పోతాయి, స్వస్థత ప్రార్థనలు చేయమని చెప్పుచున్నారు.

ఇటువంటి వారికి ఏమి తెలియకపోయినా, అన్ని తెలిసినట్లు నటిస్తారు. బైబిల్ ట్రైనింగ్ అని ఇతర మతములను ఎలా విమర్శించాలో నేర్చుకొని, మతపిచ్చి పట్టిన బోధకులు ఎందుకు ఎక్కువ అగుచున్నారో తెలుసా? అది ఒక వృత్తిగామారి, జీవనోపాధి అయింది.

నేను నిజమైన క్రైస్తవుడిని కనుక, ప్రభువు జ్ఞానము మాత్రమే గొప్పగా పెట్టుకున్నాను. ఇపుడు 'ఇందువు'గా మారాను. అంటే మతం కాదు, ఇందువు అంటే జ్ఞాని అని అర్థము. బైబిల్ ప్రభువు జ్ఞానము తెలిస్తే నీవు ఇందువే. అనగా జ్ఞానివే అని అర్థము. ఆ రోజు ప్రభువు జన్మించినపుడు భగవంతుని జన్మను గుర్తించి అక్కడికి వెళ్ళిన తూర్పు దేశము వారు భారతదేశం వారే. అంత గొప్పజ్ఞానులు కనుకే వారు ఉండే దేశాన్ని "ఇందూ దేశం" అనేవారు.

క్రైస్తవులుగా ఉన్న సోదరులారా! ఈ రోజు మనము ఏసుప్రభువు వారు దైవం అని చెప్పినప్పటికి అందరూ ప్రభువు జ్ఞానము చెప్పుకోవడము లేదు. చివరికి మనము ప్రభువుని కూడా పూజించుట లేదు. ఆయన మరణం పొందిన 'శిలువ'ను శ్రద్ధగా ఆరాధిస్తూ చర్చీలపై, మెడలలో పెట్టుకొన్నాము. ఆయన చనిపోయిన శుక్రవారము రోజు ప్రపంచానికి

ఎంతో పాపపురోజు అయితే, దానిని కూడా మాయ మనలో ప్రవేశించి 'శుభ శుక్రవారము' అని పిలుచుకునేటట్లు చేసింది. ఇది క్రైస్తవమా, మీరా క్రైస్తవులు, క్రీసు అంటే అర్థము తెలుసా ఎవరికైనా? ఏది జ్ఞానమో తెలియని మనము, దేనిని ఆరాధించాలో తెలియని మనము, ఏసు చనిపోయిన రోజును పండుగ చేసుకొను మనము క్రైస్తవులమా? ఇంతకంటే సిగ్గుమాలిన పని ఏమైనా ఉందా? మనము శిలువ భక్తులమే కానీ, ప్రభువు భక్తులము కాదు. ఇది విమర్శించడానికి అంటున్నది కాదు. ఇదే సత్యము అని మాట్లాడుతున్నాను. మనకి దేవుడు బుద్ధి ఇచ్చాడు కదా! ఎంత మనము బైబిల్‌లో దేవుని సువార్త గ్రహించగలిగామో అలోచించండి, ప్రపంచ విషయాల్లో తప్పులు జరిగితే అది ఒక జన్మతో సరి, అదే దైవమార్గములో తప్పుగా బోధిస్తే రెండు యుగాల పాటు భయంకర నరకం ఉంటుంది. తస్మాత్ జాగ్రత!!

అందువలన రూపం, పేరులేని దేవుడిని పొందాలంటే ఏమి చేయాలి అంటే ఇదే ప్రథమ దైవగ్రంథములో ఇలా ఉంది. "సర్వకాలం నీ మనస్సు నందు నన్ను స్మరింపుము, బుద్ధి, మనస్సు నాకే సమర్పించుట వలన నన్నే పొందగలవు, దీనిలో సంశయం లేదు"

జీవునికి అంత్యకాలములో ఉండే జ్ఞప్తిని బట్టి మరుజన్మగానీ, మోక్షంగాని ఉండును. ఆ చివరి జ్ఞాపకం కోసం ఇప్పటినుండే ప్రయత్నించాలి. ఆ రోజు ఆ మాట చెప్పినది కంటికి కనిపించే శ్రీకృష్ణుడు. ఆయన ఉన్నంతవరకు ఆయనను స్మరించుట అనేమాట సరిపోతుంది. ఆయన లేనపుడు ఎవరిని స్మరించాలి అన్నదే ప్రశ్న? అదే నిరాకార ఆత్మని ఆరాధించాలి. దేవుడు సాకారం, నిరాకారంలలో ఎపుడు ఉంటాడు? సాకారమును ఎపుడు, నిరాకారమును ఎప్పుడు ఆరాధించాలి అనేది పెద్ద

ప్రశ్న. పరమాత్మ సాకారుడై భగవంతునిగా వచ్చిన జన్మలో సాకారం పూజ విడిచి నిరాకారం మీదకు పోతే గొర్రెను సంకలో పెట్టుకొని ఊరంతా వెదికినట్లు అన్నమాట. అయితే ఆ జన్మ ఎపుడు కలుగునో ఎవరికీ తెలియదు.

అలాగే ఏసుప్రభువు ఉన్నపుడు ఆయనను పూజించాలి. ఆయన లేనపుడు ఎవరిని పూజించాలి. ఆ రోజు ప్రభువే చెప్పాడు. "నేనే జీవము, నేనే సత్యము, నేనే మార్గము, నేనే గమ్యము" ఆ నేను అనేది ఆ రోజు ఏసు శరీరము నుండి పలికిన 'ఆత్మ' ఆ ఆత్మనే ఎపుడూ ఆరాధించాలి, ఆ ఆత్మే మార్గము, ఆ ఆత్మే గమ్యం కావున మిగతా అన్ని కాలాల్లో నిరాకార ఆత్మారాధనే చేయాలి. కావున ఆయన సాకారంగా ఉన్న రూపంను పూజిస్తే అది ఎప్పటికీ విగ్రహారాధన కాదు. ఎందుకంటే ప్రతిమకు, విగ్రహాకు తేడా ఉంది. భగవంతుని రూపం కలిగినది ఏదైనా ప్రతిమే కానీ విగ్రహం కాదు. కావున విగ్రహారాధన అవుతుందనే భావంతో ఈనాటి క్రైస్తవులందరూ ప్రభువును ఫోటోపెట్టి పూజించడము మానేశారు. ప్రభువు ఆకారము ప్రతిమ అగును కానీ విగ్రహం కాదు. అలాగే శ్రీకృష్ణుని ఆరాధన కూడా సాకార భగవంతుని ఆరాధన అగును. ఈ సంగతి తెలియని క్రైస్తవ సోదరులు కృష్ణున్ని పూజిస్తే విగ్రహారాధన అని విమర్శిస్తున్నారు. అంతా అజ్ఞాన స్థితిలో ఉన్న మనము మతద్వేషంతో మాట్లాడుతున్నాముగానీ, జ్ఞానంతో కాదని క్రైస్తవ సోదరులు ఇప్పటికైనా గుర్తించాలి.

జగతిలో జీవరాశుల తెగల సంఖ్య 84 లక్షలని అంటున్నారు. అందులో మానవునికి మాత్రమే బుద్ధి వివేచనాశక్తి ఉంది. అటువంటి విచక్షణా శక్తి గల మానవుడు ఆశ అను గుణం వలన తన ఆయువు దేవుని చేతిలో ఉందని మరచి ప్రవర్తిస్తున్నాడు. పూర్వము ఆయువును

'వాయువుగా' లెక్కించేవారు గతంలో చేసుకున్న పాపపుణ్యాలుబట్టి నీవు అనుభవించుటకు కర్మ అను మర్మంనుపెట్టి శ్వాసల లెక్కాచారంతో ఆత్మ జంత్రగాడు బొమ్మలను ఆడించినట్లు నీ శరీరాన్ని ఆయన ఆడిస్తున్నాడు. ఈ విధంగా శరీరాన్ని ఆడించే దేవుడు ఆత్మ అని మరువకూడదు. ఈ ఆత్మనే 'అక్షరం' అంటున్నాము. అనగా నాశనం లేనివాడు అని అర్థము. దేవుడు అనగా దేవులాడబడేవాడు. కావున నీవు ఎంత బయట వెతికినా తెలియబడడు. అటువంటి దేవుడు 'ఆత్మ' రూపంలో శరీరములో సర్వకార్యములు చేయుచూ, పనిచేసే దేవుడుగా ఉన్నాడు. కావున దేవుని చేరుకోవాలంటే శరీరంలో వెతకాలి. పూర్వం యోగులందరూ శరీరములో ఆత్మని వెదికి తెలుసుకొని చివరకు పరమాత్మలో కలిసిపోయారు.

సోదరులారా! దేవుడెవరో మనము తెలుసుకోవాలంటే ముందు నీవు ఎవరో తెలుసుకో? నీవు ఎవరు? అను ప్రశ్నకు సమాధానము లేనంతవరకు దేవుని వివరము తెలియదు. నేను ఒక మనిషిని అనుకుంటే పొరపాటు. కనిపించే స్థూలశరీరము చూసి అది నీవు అనుకుంటే ఆధ్యాత్మికం తెలియనట్లే. అందుకే ముందు ప్రకృతి వివరము తెలియాలి. పంచభూత నిర్మితమైన శరీరము. అందులో నీవు ఎవరు? నీ స్థానము ఏది? అని తెలిసినప్పుడే మనకు సూక్ష్మంగాగల జ్ఞానము గ్రహింపునకు వస్తుంది. కావున నీవు ఎవరు, నీవు ఎక్కడ ఉన్నావు తెలిస్తే అపుడు నిన్ను నడిపించే శక్తి తెలుస్తుంది. అపుడు గమ్యమైన పరమాత్మ వివరము తెలుస్తుంది. ఇలా తెలియబడటమే నిజమైన జ్ఞానము.

అటువంటి జ్ఞానాన్ని సంపూర్ణముగా భూమిమీద అందించేవాడు గురువు. గురువు అంటే దైవఅంశ మనిషి రూపంలో రావడం. ఆ జన్మ

అరుదుగా జరుగుతుంది. ఎవరూ చెప్పలేని జ్ఞానాన్ని, అడుగంటి పోయిన ధర్మాలను తెలియజేస్తాడు. కావున వినేదంతా జ్ఞానము అనుకుంటే పొరపాటు. మాయాజ్ఞానమును కూడా గురువు పేరుతో చాలామంది చెప్పేవారు ఉంటారు. మనము నిజమైన జ్ఞానము కావాలని కోరుకుంటే దేవుడే అందిస్తాడు. అందువల్ల మాయా గురువు ఎవరో, నిజగురువు ఎవరో చెప్పిన జ్ఞానమును బట్టి తెలుసుకోవచ్చు. జ్ఞానము అనేది సూత్రబద్ధంగా శాస్త్రబద్ధంగా, సత్యబద్ధంగా ఉంటుంది. అటువంటి జ్ఞానము ఈ రోజు త్రైత సిద్ధాంత ఆదికర్త అయిన శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు తెలియజేస్తున్నారు. ఆ గ్రంథాలను చదివితే జ్ఞానము విలువ, దేవుని గొప్పదనము తెలుస్తాయి. ఇంకా ఎంతకాలం మనము మోసపోతూ ఉంటాము. ఇప్పటికైనా కళ్ళు తెరవండి. మతం అనే మత్తులోనుండి వచ్చి జ్ఞానము అనే అమృతమును త్రాగండి. వక్రబుద్ధి కలిగినవారికి అన్ని వక్రంగానే కనపడతాయి. మతపిచ్చిలో ఉన్నవాడికి జ్ఞానాన్ని గ్రహించే శక్తి ఉండదు. కావున దైవం కావాలనే తపన, జిజ్ఞాస కలిగిన వారికి మాత్రమే దేవుడు జ్ఞానాన్ని అందిస్తాడు.

వక్రబుద్ధి కలిగినవాడు దేవుని జ్ఞానాన్ని గ్రహిచకుండా, పురాణాలు, వేదాలు, శాస్త్రములు అన్ని కలగలిపి చెప్పుకుంటాడు. అన్నీ దేవుడు చెప్పినవే అని చెప్పి ఇతరులను వక్రమార్గములో పంపిస్తాడు. దేవుని విషయములు దేవునికే తెలుసు. ఏ మానవునికీ తెలియదు అని దేవుడే గ్రంథములలో చెప్పాడు. అటువంటపుడు మానవులు స్వంత తెలివి మీద ఎలా తెలుసుకోగలరు, సాధ్యంకాదు. దేవుడు భూమిమీద భగవంతునిగా జన్మించి తెలియజేసినపుడు శ్రద్ధ, బుద్ధి గలవారు గ్రహిస్తారు. వక్రబుద్ధి కలిగిన వాడు దేవుని జ్ఞానమునుండి దూరముగా పోతాడు.

## మత మౌఢ్యానికి ఉదాహరణ ఈ జరిగిన సంఘటన:-

రామయ్య అనే పేరు గల వ్యక్తి చేపల బోటు నడిపి, సముద్రంలో చేపలవేటకు వెళ్లి బ్రతికేవాడు. హిందూమతంలో ఉంటూ, అందరినీ మ్రొక్కే ఆయన వెళ్లని గుడి లేదు. మూఢభక్తి గల అతనికి కొద్ది సంవత్సరముల తర్వాత బోటు వ్యాపారం సరిగ్గా సాగలేదు. ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగా లేనందువలన బోటు సముద్రంలోనికి తీసుకెళ్లడానికీ ఇబ్బంది పడేవాడు. విశాఖపట్నం తీరం నుండి ఒకసారి బోటు వెళ్లి రావడానికే ఒక లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. ఈ డబ్బులు కూడా సమకూర్చుకోలేని పరిస్థితి ఉండటంతో మానసికంగా బాగా కృంగిపోయాడు.

అటువంటి సమయంలో ఆయన ఇంటి ప్రక్కనే రోజూ ప్రార్థనలు చేసే వారివద్దకు వెళ్లి అయ్యా! మీ దేవుడు నన్ను ఈ కష్టాల నుండి కాపాడగలడా? అని అడిగాడు. అపుడు అక్కడ ప్రార్థన చేసిన వ్యక్తి దేవుడ్ని నమ్ముకుంటే ఏమైనా జరుగుతుంది. ఏసు ప్రభువు నీకు కష్టాలు తొలిగిస్తాడు. మా ఫాస్టర్ గారిని దేవుడు వాడుకుంటున్నాడు. కనుక ఆయన ప్రార్థన చేస్తే నీకష్టాలన్నీ తొలగి పోతాయి. కావున నీవు ఏసుప్రభువుని నమ్ము కుంటావా అని అడిగాడు. రామయ్య సరేనని ఇద్దరూ ఆదివారం నాడు ఫాస్టర్ గారి దగ్గరికి వెళ్లారు. ఆరోజు ప్రసంగం అయిన తరువాత ఇద్దరూ ఆయన్ని కలిసారు.

**ఫాస్టర్ :-** ఎవరండీ మీరు క్రొత్తగా వచ్చారా?

**విశ్వాసి :-** అయ్యా! ఈయన పేరు రామయ్య. ఇతను చేపల వ్యాపారంలో బాగా నష్టపోయి, ఇంట్లో బయట అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నాడు. దేవుని నమ్ముకుంటే అవన్నీ పోతాయని చెప్పి తీసుకువచ్చాను.

**ఫాస్టర్ :-** ఏమి రామయ్యా! అంతేనా నీకష్టం.

**రామయ్య :-** అవునండీ అయ్యగారు. నేను బాగా నష్టపోయాను. ఎందరో దేవుళ్లని రోజూ మ్రొక్కుతూ ఉంటాను. ఒక్కరు కూడా నా కష్టాన్ని తీర్చలేక పోయారు. నా బ్రతుకు మీద నాకే విరక్తి కలుగుతుందయ్యా అని బాధగా చెప్పాడు.

**ఫాస్టర్ :-** దేవునికి వందనాలు, నా తండ్రి గొప్పవాడు, హల్లెలూయా! అని ప్రార్థన చేసి ప్రభువా ఈ బిడ్డను దీవించండి. ఈ బిడ్డడు అడిగిన వన్నీ సమృద్ధిగా ఇవ్వండి. ఇపుడే దయచేయండి ప్రభువా, ఎంతో మంది బీదలను కనికరించిన ఓ తండ్రీ ఈ రామయ్యకు బాధలు తొలగిపోయేటట్లు చేయండి ప్రభువా! అని ప్రార్థన చేశాడు. అపుడు రామయ్య ఆ లేని పరిస్థితుల్లో బహుకష్టంగా తన దగ్గర ఉన్న డబ్బులు కానుకల రూపంలో ఫాస్టర్‌కి సమర్పించుకున్నాడు. తర్వాత రామయ్యని ఉదయం 10గం॥లకు కొబ్బరి నూనె పట్టుకొని బోటు దగ్గరికి రమ్మని చెప్పి, నేను కూడా వస్తాను, ఈ రాత్రంతా ప్రభువుని ప్రార్థన చేసి ప్రభువుతో మాట్లాడతాను అని చెప్పాడు. తర్వాత రోజు వెళ్లి బోటు దగ్గర ప్రార్థన చేసి, రామయ్యా! ఇక నీ బోటులో విస్తారంగా చేపలు పడతాయి. రాత్రి ప్రభువు వారితో మాట్లాడాను అని చెప్పాడు.

రామయ్య లక్ష రూపాయలు అప్పు చేసి ఆ డబ్బుతో డీజిల్ వేయించి వేటకు పోయాడు. కొద్ది రోజులకు ఒడ్డు చేరాడు. చేపలు బాగా పడ్డాయి. మా ఫాస్టర్ గారి ప్రార్థన బాగా పని చేసింది. ఏసు ప్రభువుని నమ్మడం వల్లే ఇదంతా జరిగిందని దేవునికి కానుకలు కొన్ని ఇచ్చాడు. రెండు నెలల తర్వాత మరలా వెళ్లాడు. ఈసారి చేపలు పడలేదు. ఇదేంటి ఫాస్టర్ గారితో

ప్రార్థన చేయించుకున్నా కదా! ఎందుకు ఇలా జరిగింది అని ఫాస్టర్‌ని అడిగాడు. నేను ప్రతీక్షణం ప్రభువుని తల్చుకొనే ఉన్నాను. మరి నాకు ఎందుకు ఇలా జరిగింది అని అడిగాడు.

**ఫాస్టర్ :-** రామయ్యా! నీవు అడగడంలో లోపం ఉంది. ఉపవాసం ఉండి ప్రార్థన చేయాలి. అని అన్నాడు.

కానీ రామయ్యను కర్మ విడిచి పెట్టలేరు. ఎన్ని చేసినా ఫలితం లేదని నిరాశలో ఉన్నాడు. ఇంతలో మల్లయ్య అనునతడు క్రొత్తగా బోటు తయారు చేసుకొని వేటకు వెళ్లుటకు నిర్ణయించుకొని మంచి ముహూర్తం కోసం పంతులు దగ్గరికెళ్లాడు.

**శర్మ :-** ఏమయ్యా మల్లయ్య ఏంటి సంగతులు, అని మల్లయ్యని అడిగాడు.

**మల్లయ్య :-** అయ్యా! నేను కొత్తగా బోటుకొన్నాను. మంచి ముహూర్తం చెప్తారని వచ్చాను.

**శర్మ :-** మల్లయ్యా! రేపు ఏకాదశి మంచిరోజు, రేపు ఉదయం 6గం॥ లకు పూజ చేస్తే తిరుగులేదు. పూజా సామాగ్రి అంతా తీసుకురా, రేపు పూజ చేస్తాను అని చెప్పాడు.

తర్వాత రోజు శర్మ గారు బోటువద్దకు వెళ్లి గంగమ్మ తల్లికి పూజలు చేసిన తర్వాత పంతులు గారికి 10,000రూ॥ ఫీజు ఇచ్చుకున్నాడు. అలాగే వ్యాపారం చేసుకుంటూ మల్లయ్య జీవిస్తున్నాడు.

కొన్ని రోజుల తర్వాత రామయ్యకు మల్లయ్య కలవడం జరిగింది. ఇద్దరూ పరిచయం ఉన్నవాళ్లే, వాళ్లు మాట్లాడుకున్నపుడు రామయ్య తన కష్టాలు పడడము, క్రైస్తవంలోకి మారడం, మరినా జీవితం మారక పోవడం

అన్నీ చెప్పాడు. అపుడు మల్లయ్య దీనికి ఒకే మార్గం ఉంది, నాకు తెలిసిన పంతులుగారు ఉన్నారు. అయనకు తెలియనిది ఏమీ లేదు, పురాణాలు, వేదాలు అన్నీ చెప్పగలడు. ఆయన నీ బాధకు నివారణ చెప్పగలడు అని చెప్పి రామయ్యను, మల్లయ్య శర్మగారి వద్దకు తీసుకుపోయాడు.

**శర్మ :-** ఏం మల్లయ్యా! బాగున్నావా? ఎవరు ఇతను ఎందుకొచ్చారు?

**మల్లయ్య :-** నమస్కారం శర్మగారు! ఇతను నామిత్రుడు, ఈయన ఎందరు దేవుళ్ళను నమ్మినా ఈయన రాత బాగాలేదు. తమరు ఏదైనా ఉపాయం చెప్తారేమోనని ఇక్కడికి తీసుకువచ్చాను.

**రామయ్య :-** అయ్యా! నమస్కారం, (అని తన పరిస్థితి, క్రైస్తవునిగా మారినది అంతా చెప్పుకున్నాడు)

**శర్మ :-** బిగ్గరగా అరిచి లేముందు కుర్చీలోంచి, నీవు క్రైస్తవుడివి అయితే వెళ్లి నీప్రభువునే అడుగు. ఇక్కడికెందుకు వచ్చావు. మర్యాదగాపో! అని అరిచాడు.

**మల్లయ్య :-** అయ్యా నేనే రమ్మన్నాను. తప్పయింది, మన్నించండి అని వేడుకొన్నాడు.

తర్వాత కొంతసేపటికి శర్మ శాంతించి, ఏమి రామయ్యా నీ వ్యాపారం బాగా సాగడానికి ఫాస్టర్‌కి ఎంత ఇచ్చావు అని అడిగాడు.

**రామయ్య :-** అయ్యా వ్యాపారం బాగా సాగడానికి ప్రార్థన చేస్తున్నానని చెప్పి వెళ్లినపుడల్లా తీసుకునేవాడు.

**శర్మ :-** అయితే నీవు వెళ్లి ఫాస్టర్ గారికి ఇచ్చిన డబ్బుల్లో 1,000రూ॥ తెచ్చి, ఆ డబ్బుతో పూజచేస్తే దోషం పోతుంది. వేరే డబ్బులతో చేస్తే ఫలితం ఉండదు మరి అని చెప్పాడు.

**రామయ్య :-** అయ్యా! ఇచ్చిన డబ్బులు మా ఫాస్టర్ గారు తిరిగి ఇస్తారంటారా?

**శర్మ :-** ఇస్తే తేసుకురా, లేకపోతే నీ ముఖం నాకు చూపకు.

రామయ్య అలాగే అని తనకు ఫాస్టర్‌ను పరిచయం చేసిన విశ్వాసి వద్దకు వెళ్లి ఫాస్టర్ గారిని 1,000రూ॥ ఇవ్వమని అడుగు అని చెప్పగా ఫాస్టర్ గారంటే ఏమనుకుంటున్నావు, ఆయన దైవసేవకుడు, అటువంటి వారికి నీవు ఇవ్వాలి గానీ, తిరిగా అడుతుతావా, చాలాతప్పు అని చెప్పాడు.

వీరితో ఇంకెందుకులే అని నేరుగా వెళ్లి ఫాస్టర్‌ని కలసి అయ్యా! నాకు అవసరం పడింది, నాకు ఒక 1,000 రూ॥ కావాలి ఇప్పించండి అని అన్నాడు. వెంటనే ఫాస్టర్ దైవసేవకులకు నీవు ఇవ్వాలిగానీ, నన్ను అడుగుతావా, అయినా నావద్ద ఇపుడు అంత డబ్బులు లేవు అని అన్నాడు. వెంటనే రామయ్య అయ్యగారూ! మిమ్మల్ని నమ్మి ఎన్నో సార్లు మీకు డబ్బులు ఇచ్చాను. ఇపుడు అవసరానికి అడిగితే లేవంటావా? అసలు నీవు ఫాస్టర్‌వేనా? అని గద్దించి అడిగాడు.

ప్రక్కనే విశ్వాసులు అయ్యగారిని ఫాస్టర్ కాదంటావా? అని అడిగేసరికి కోపం వచ్చి ఈ రామయ్యకు సాతాను పట్టేసింది, అందుకే ఇలా మాట్లాడుచున్నాడు అనేసరికి రామయ్యకు ఈ పరిస్థితి చూసి ఆశ్చర్యం వేసింది. అటు ఫాస్టర్ ఇవ్వడు, ఇటు పంతులు ఆ డబ్బే తెమ్మన్నాడు, ఎలా? నాబ్రతుకు ఎందుకు ఇలా అయింది, అనుకున్నాడు. ఇదంతా చూసిన నేను (తులసి) పంతులు గారితో ఇలా అన్నాను.

**తులసి :-** అయ్యా! పంతులుగారు, మీరు అతనికి అలా ఇబ్బంది పెట్టేబదులు, ఏదోలా చేసి మీ బ్రతుకు తెరువు మీరు చూసుకోవచ్చు కదా!

**శర్మ :-** మీకు తెలియదండీ! వీళ్లు హిందువులై ఉండి, క్రైస్తవులుగా మారి మన మతాన్ని నాశనం చేస్తున్నారు, ఎక్కడి నుండి వచ్చారు, ఈ క్రైస్తవులు మన వాళ్లని మాయ మాటలు చెప్పి మార్చినవారే కదా!

**తులసి :-** శర్మగారు, ఆ రామయ్య మరి రాడా?

**శర్మ :-** ఇంకేమి వస్తాడు, ఆ ఫాస్టర్ ఇవ్వడు, నేను రానివ్వను అన్నాడు.

చూసారా దేవుని జ్ఞానం తెలియక పోతే ఎక్కడికి వెళ్లినా తోడేళ్లు ఉన్నయి. ఈ విధంగా దేవుని జ్ఞానం పేరిట నిలువు దోపిడి చేస్తున్నారు. ఏమీ తెలియని ప్రజలు వారి మాయమాటలు నమ్మి అజ్ఞాన మార్గంలోకి పోవుచున్నారు.

దేవుడు ఒక్కడే అని చెప్తున్నారు. ఆ ఒక్క దేవుడు తమవాడే అంటున్నారు. ముందు జ్ఞానం తెలుసుకుంటే ఏది సరైనదో, ఏది సరికానిదో తెలుస్తుంది, లేకపోతే మోసపోతాము. క్రైస్తవ సోదరులారా, ఈరోజు జరుగుచున్న సత్యం ఇది కాదా! దేవుడు ఏ గ్రంథములోనైనా నన్ను మ్రొక్కితే కష్టాలు పోతాయి అని చెప్పాడా? మరి దేవుడు చెప్పని దాన్ని ఎందుకు చెప్పి అమాయకులని మోసం చేస్తున్నారు? బ్రతకడానికి చాలా దారులే ఉన్నాయి. ఈ విధంగా దైవసేవకులని దోచుకోవడం ఏ నీతి, ఏ ధర్మం. నిజమైన దేవుని సేవ చేసేవాడు, దేవుని దగ్గరకు వచ్చిన వారి దక్షిణలు తీసుకోడు. నీవు కష్టపడిబ్రతుకు, నీ కష్టంతో కచ్చిన డబ్బులు దేవుని సేవకు ఉపయోగించు, అంతేగానీ దేవున్ని అడ్డంపెట్టుకొని బ్రతకకూడదు. కావున దేవుని విలువ తెలియాలంటే గురువు చెప్పిన జ్ఞానం గ్రహించినపుడే తెలుస్తుంది. అంతేకానీ ఇటువంటి బోధకుల మాటలవల్లకాదు.

## గురువు వివరము :-

కనపడని దేవుడు, ధర్మ సంస్థాపనార్థం ఎప్పుడైనా శరీరంతో జన్మిస్తే అటువంటి సాకార దైవాన్ని **'గురువు'** అంటాము. గురువు జన్మ అందరి మానవులలాగా కర్మననుసరించి కాక పరమాత్మ ఉద్దేశ్యపూర్వకంగా ఉండును. ఒకే ఆత్మ మూడు ఆత్మలుగా ఏ శరీరంలో పని చేస్తున్నదో అదే 'గురువు' జన్మ. అతను కూడా అందరివలె సామాన్యజీవనం గడుపుతూ, మనిషివలె కష్టాలు సుఖాలు అనుభవిస్తూ ఉండటం వలన, ప్రత్యేకంగా ఏమీ కనపడదు. గురువు అన్ని కార్యాలను గుణాలతోనే చేస్తున్నప్పటికీ ఏ గుణ మలినం అంటనివాడు. ఆయన పనులు గానీ, జీవన విధానం గానీ ఏమీ అర్థం కానట్లు ఉండును. ఆయన ప్రపంచంలో ఏ ప్రత్యేకత లేనివాడైనప్పటికి జ్ఞానంలో మాత్రం ప్రత్యేకత కలిగి ఉండి, ఎవరూ చెప్పలేనటువంటి ధర్మ సూక్ష్మాలు తెలియజేయును. అటువంటి గురువు సాక్షాత్ పరబ్రహ్మ. అటువంటి గురువు దొరుకుతాడా?

ఉదాహరణకు మనకు తల్లిదండ్రులు కలరు. పుట్టించిన వానిని నాన్న అంటున్నాం. మరి నాన్నని పుట్టించినవాడు ఎవరు! ఇలా ప్రశ్న వేసుకుంటూ పోతే అందరినీ పుట్టించిన తండ్రి పరమాత్మ. ఇలా అందరినీ తయారు చేసిన వాడికే నీ గురించి తెలుస్తుంది. అందువల్ల ఆయన చెప్పినపుడు మాత్రమే ఆ రహస్యం తెలియబడును. అలా ఆయన వచ్చి చెప్పడాన్నే 'గురువు' చెప్పడం అంటున్నాము. నిరాకార దైవం యొక్క సాకారరూపమే గురువు. ప్రియ మిత్రులారా! నిజం నిష్ఠూరంగా ఉంటుంది. ఇటు మాయ అటు దైవం ఆటలో అసలు రహస్యం తెలియాలంటే ఒక చిన్న ఉదాహరణ ద్వారా దైవం, గురువు యొక్క విధానం తెలుసుకుందాం.

ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. పెద్దవాడు తన డబ్బుతో బంగారం అర తులం కొనుక్కున్నాడు. తమ్ముడు అన్నని ఆ బంగారం ఇమ్మన్నాడు. సరే తమ్ముడే కదా! అని ఉంచమన్నాడు. ఆ బంగారాన్ని తీసుకెళ్లి తమ్ముడు ఉంగరం చేయించుకున్నాడు. తరువాత కొంతకాలానికి అన్న తన బంగారాన్ని అడిగాడు. అపుడు తమ్ముడు ఈ ఉంగరం నాకు తిరిగి ఇచ్చేసి అందులో బంగారాన్ని తీసుకో అన్నాడట. ఇపుడు ఆ ఉంగరాన్ని బంగారంగా మారిస్తే ఉంగరం ఉండదు. తమ్ముడేమో నీ బంగారాన్ని నీవు తీసుకొని నా ఉంగరాన్ని ఇవ్వు అంటున్నాడు. ఇది ఎలా అని ఆలోచిస్తున్నాడట.

ప్రకృతి ముందులేదు, ముందు పరమాత్మ ఒక్కరే ఉన్నాడు. అటువంటి పరమాత్మ ఆకారాన్ని తయారు చేసుకొని ఉంగరంలా వస్తాడు. బంగారం నేనే అంటాడు, ఉంగరం నేనే అంటాడు. ఉంగరం బంగారమా అంటే బంగారానికి ఉన్న ఆకారమే 'ఉంగరం'. అలాగే నిరాకార దైవం ఒక రూపం దాల్చినపుడు సాకారం. ఆ సాకారంలో ఉన్నది నిరాకార దైవమే. ఇలా దేవుడు సాకారంగా వచ్చినపుడు ఆ సాకారాన్ని వదిలి నిరాకారం వైపు పోనవసరం లేదు. అటువంటి గురువు భూమి మీద జన్మిస్తే ధర్మాలు తెలియబడతాయి. అటువంటి ధర్మాలు ఈ రోజు త్రైత సిద్ధాంతంలో తెలియబడుతున్నాయి. ఇటువంటి జ్ఞానాన్ని ఇంతవరకు ఎవరూ చెప్పలేదు. మేము ఎవరినో పొగుడుతున్నాం అనుకోకండి, ఒక్క సారి చదవండి. మీకే తెలుస్తుంది. **"జనన మరణ సిద్ధాంతం"** ఒక సంచలానాత్మకం, **"మరణ రహస్యం"** చదివితే ప్రభువు మరణిచంలేదు అని తెలుస్తుంది, **"సమాధి"**, **"దేవాలయ రహస్యాలు"** ఇలా ప్రతీ గ్రంథం అద్భుతమే! మన ప్రభువే తెలియజేస్తున్నాడేమోనని నాకు అనిపిస్తుంది. ఇది ఎంత వరకు నిజమో తెలియాలంటే, ఒకసారి త్రైత సిద్ధాంత గ్రంథాలు చదవండి! ప్రభువు

ఉన్నత స్థితిని తెలుసుకుందాం. వృథాగా పాటలు అనీ, ప్రార్థనలు అనీ నీ కాలాన్ని వృథా చేసుకోకు. నీ జీవితం సగం గడిచింది. ఇంకా ఎన్నాళ్లు బ్రతికి ఉంటామో తెలియదు. ఇప్పటికైనా నిజమైన జ్ఞానాన్ని ఆశ్రయిద్దాం. మన కర్మను కాల్చుకునే జ్ఞానాన్ని పొందుదాం.

## గురువు ఎవరిని పూజిస్తాడు :-

గురువు సాక్షాత్ పరమాత్మ శక్తి కనుక ఆశక్తి ఎవరినీ పుజించదు. ఎందుకంటే దానికి మించిన శక్తి ఇంకొకటి లేదు. అయన ఎవరినీ మ్రొక్కడు. ఎవరినీ పూజించడు. నాకు లోపల ఆత్మ తెలియజేసిన విషయాన్నే మీకు తెల్పుతున్నాను. నేను మీ లాంటివాడినే అంటాడు. నా బాధలు నేనే పోగొట్టుకోలేను అని ఒక ప్రక్క చెప్తూ, ఎవరూ తెలియజేయలేని జ్ఞానాన్ని చెప్తుంటాడు. మీ శరీరాన్ని ఆడిస్తున్న ఆత్మే మీకు దైవం కనుక ఆత్మతో స్నేహం చేసి ఆత్మనే అడగండి అని చెప్తుంటాడు. ఆత్మగా ఉన్నపుడు సృష్టి ఆదిలో నుండి ఉన్న జ్ఞాన విషయాలు మరియు చెప్పబోయే సంగతులు మాద్వారా తెలియాలి తప్ప ఎవరూ తెలియజేయలేరు. ఇది మతాతీత జ్ఞానం, ఇది రహస్యమైన జ్ఞానం మీకు తెలియజేస్తున్నాను శ్రద్ధగా వినండి అని ఆత్మగా జీవున్ని మందలించి తెలియజేసిన గురువు త్రైత సిద్ధాంత ఆదికర్త. ఆయన 37సం॥ క్రితం త్రైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించి నేటికీ జ్ఞానాన్ని అందించడం జరుగుతుంది.

ప్రతి మనిషీ తెలుసుకోవలసినది ఒకే ఒక దైవ జ్ఞానం. ఆ జ్ఞానం మిమ్మల్ని మార్చగలదు. దైవజ్ఞానం లేని ప్రయాణం వాహనానికి లైట్ లేకుండా ప్రయాణం చేయడం లాంటిది. లైట్ లేని వాహనంపై ప్రయాణం చేస్తే చీకటిలో ఎక్కడైనా ప్రమాదానికి గురికావలసి వస్తుంది. లైట్‌తో

ప్రయాణం చేస్తే సాఫీగా సాగుతుంది ప్రయాణం. అటువంటి లైట్ లాంటిదే ధర్మము. ఆత్మజ్ఞానం లేని జీవితం వాసన లేని పువ్వులాంటిది. జ్ఞానం తెలియకపోతే జీవితంలో ఎదురయ్యే కష్టాలకు మార్గం కనిపించదు.

ప్రియమిత్రులారా! ఒక్క క్షణం ఆలోచించండి. ప్రతీ సమస్య నీది అనే భ్రాంతిలో పడిపోతున్నావు. మోహగుణం వల్ల శరీరాన్ని నీదిగా భావించుకొంటున్నావు. శరీరానికి వచ్చే బాధలు నీవిగా భావించుకొంటున్నావు. అందువల్ల కర్మ వల్ల సంభవించే బాధలు, కష్టాలు, సుఖాలు నిన్ను తిరిగి కర్మ చక్రంలో బాధిస్తున్నాయి. మరలా నీవు అదే ఉచ్చులో చిక్కుకుంటున్నావు. నీవు అందులో నుండి బయటకు రావవాలంటే అసలైన జ్ఞానం, నీ శరీరంలోనే అధిపతిగా ఉన్న ఆత్మను గూర్చి తెలుసుకోవాలి. అటువంటి 'ఆత్మజ్ఞానాన్ని' అందించింది ప్రపంచంలో 'ప్రబోధానంద యోగీశ్వరులు' ఒక్కరే. ఆయన చెప్పినది అన్ని గ్రంథాల్లో ఉన్న జ్ఞానం. శరీరంలోపల అందరికీ సమానంగా ఉన్న శక్తి గూర్చి. ఇదే విషయాన్నే భగవద్గీత, బైబిల్, ఖురాన్ బోధిస్తున్నాయి. కానీ మనం వాటి సారాన్ని శరీరం లోపల కాకుండా బయట వెతుకుతున్నాము.

బైబిల్ తెలుసుకొని, భగవద్గీత తెలియకపోతే వాడు జ్ఞాని కాదు. ఖురాన్ మాత్రమే తెలిసి, బైబిల్, భగవద్గీత తెలియకపోయినా నీకు ధర్మం తెలియదు. అటువంటివారు మతాన్ని అడుపెట్టుకొని మాగ్రంథం గొప్పది అంటే మాగ్రంథం గొప్పది అంటారు. కానీ ఇక్కడ అటువంటి ప్రచారం లేదు. బైబిల్, ఖురాన్, భగవద్గీత మూడు దైవ గ్రంథాలని మూడూ ఒకే దేవుని గూర్చి తెలియజేసేవి అని ఒకే ఒక్క **"త్రైత సిద్ధాంతము"** లోనే చెప్ప బడుతుంది. అటువంటి జ్ఞానాన్ని అందజేసిన మహాత్ముడు **శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు.**

ఖురాన్ జ్ఞానం అర్థం కావాలంటే **'అంతిమ దైవగ్రంథములో జ్ఞాన వాక్యములు'** చదవండి. బుద్ధి, శ్రద్ధ ఉన్నవారు మాత్రమే ఈ జ్ఞానాన్ని గ్రహించగలరు. గడ్డాలు పెంచుకొని, మతమౌఢ్యంలో ఉన్నవానికి తెలియ బడదు. ఎందుకంటే మొదటే చిన్న చూపుతో గ్రంథాన్ని చూస్తారు. వీరే వక్రబుద్ధి కలిగినవారు. ఖురాన్ కూడా ప్రథమ దైవగ్రంథాన్ని సమర్థించడానికి వచ్చిన గ్రంథం. దీనిలో భగవద్గీతను 'తౌరాత్' గా సంబోధించడం జరిగింది. తౌరాత్ అనగా "మూడు చీకటి రాత్రులు" అని అర్థం. సృష్టి ఆదిలో ఆకాశవాణి ద్వారా చెప్పబడిన జ్ఞానమే "భగవద్గీత" రూపంలో ఉంది.

ఈ భగవద్గీతను కూడా చాలా మంది తెలుగులో వ్రాసారు. అయితే ఎవరూ దేవుని భావాన్ని సంపూర్ణంగా అందించలేకపోయారు. శ్రీ మళయాల స్వామి, శ్రీ విద్యాప్రకాశానందగిరి, శ్రీ సుందరచైతన్యానంద ఇటువంటి ఎందరో వ్రాసిన గీతల్లో వక్రంగానే జ్ఞానం తెలియబడింది. కారణం దేవుని విషయం దేవునికే తెలుసు. ఏ మనిషీ చెప్పలేడు. ఆ విషయం గ్రంథంలో ఉన్నప్పటికీ వీళ్లందరూ మాకు తెలుసు అని వక్రమార్గంలో ప్రజల్ని నడిపిస్తున్నారు.

అన్ని మతాల్లో కూడా ఇటువంటి మత పెద్దలకు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉంది. నిజమైన జ్ఞానం తెలిసినపుడు వీరికి పుట్టగతులు ఉండవు. వీరి మోసం బయటపడక తప్పదు. దేవుని శిక్ష నుండి వీరు ఎవరూ తప్పించుకోలేరు.

ప్రజలారా గమనించండి! ఏవ్యక్తి గురువుగా మారలేడు. గురువు ఒక శక్తి. **"గురువు మనిషిగా వస్తాడు"** కానీ **"మనిషి గురువు కాలేడు".** కావున నిజమైన గురువు చెప్పిన జ్ఞానం తెలుసుకుంటేనే దేవునిలో ఐక్యమయ్యే

విధానం తెలియును. నిజమైన గురువును వేషధారణ వల్ల గుర్తించలేము. ఆయన ఎపుడూ ఏ సాధన చేయడు, ఎవరికీ నమస్కరించడు.

నిజ గురువు ధర్మానికి హాని ఏర్పడినపుడు తన ధర్మాలు తెలియజేసి పోతాడు. అపుడు ఫలానా వ్యక్తి సామాన్యుడు కాదు అని జ్ఞానం వల్ల తెలుస్తుంది. వెళ్లి పోయాక తెలిసినా ప్రయోజనం లేదు.

ఈరోజు అజ్ఞానులను, ఏమీ తెలియని మూర్ఖులను తన జ్ఞానం వల్ల జ్ఞానులుగా మార్చి, మతాతీత మనిషిగా తయారు చేస్తున్న త్రైత సిద్ధాంత ఆదికర్త అయిన ప్రబోధానంద యోగీశ్వరుల బోధలు ఎంతో ఉన్నతమైనవి. నీవు దైవ మార్గంలో ఉండాలంటే ఈ రచనలు చదువు. ఇంకా మతం అని అడ్డుగోడ పెట్టుకోకు, ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఆ మహాత్ముని బోధలు తెలుసుకోండి. దైవజ్ఞానాన్ని అర్థం చేసుకోండి....